thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 95 | జగిత్యాల | శుక్రవారం | 03 జూలై, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## శ్రీలంకలో టీమిండియా పర్యటన



11

## యూజర్‌నేమ్‌పై వాట్సాప్ క్లారిటీ



- ఇంకా అమల్లోకి రాలేదు.. దశలవారీగా అందుబాటులోకి
- యూజర్‌నేమ్ ఉన్నా మొబైల్ నంబర్ తప్పనిసరే
- కేంద్రం ఆందోళనలకు మెటా సంస్థ వివరణ

4

## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం



అమర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర ప్రారంభమైంది. క్షేత్ర దర్శనానికి బాల్తాల్ రూట్‌లో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం లభించింది.

4

## జపాన్ ప్రధాని నా అందమైన చెల్లెలు



- మోదీ ఆప్యాయతకు తకాయిచీ ఫిదా
- భారత్-జపాన్ బంధానికి కొత్త ఊపు
- రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- ఫార్మా, రక్షణ, కృత్రిమ మేధస్సు రంగాల్లో కీలక ఒప్పందాలు

4

## మూసీ తొలి దశకు గ్రీన్ సిగ్నల్

### కొత్త చట్టాలపై సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం

- టీచర్లకూ ఇక మధ్యాహ్న భోజన సదుపాయం
- ఆసుపత్రుల్లో 6278 వైద్య పోస్టుల మంజూరు
- కేబినెట్ కీలక నిర్ణయాలు!

వివరాలు 3లో..



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు తొలి దశ పనులతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పోస్టుల మంజూరు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం లాంటి విశేష అంశాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

## కవిత అరెస్టు

### ఉప్పల్‌లో ఉద్రిక్తంగా మారిన భూపోరాటం

బోడుప్పల్‌లో టీఆర్ఎస్ అధ్యక్షురాలి అడ్డగింత







## గురుకుల టెండర్లపై తీవ్ర దుమారం

# రణరంగం

### చర్చకు సిద్ధమైన ముగ్గురు మంత్రులు ..అమరవీరుల స్తూపం వద్ద ఎదురుచూపులు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల సవాళ్లు
- కత్తులు దూసిన అధికార, ప్రతిపక్షాలు
- వేడెక్కిన రాజకీయాలు
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ నిరీక్షణ
- తోపులాటలో కిందపడ్డ హరీశ్ రావు.. దారిలోనే అరెస్టు
- పోలీసులతో బీఆర్ఎస్ శ్రేణుల వాగ్వాదం
- తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన పరిణామాలు
- నగరంలో భారీగా పోలీసుల మోహరింపు
- చర్చల పేరిట భగ్గుమన్న రాజకీయాలు

సవాళ్లు.. ప్రతిసవాళ్లు.. ఆపై పోలీసుల అడ్డగింపులు.. అరెస్టులతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా రణరంగాన్ని తలపించాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం కాస్తా ఏకంగా ముఖాముఖి తేల్చుకునే స్థాయికి చేరడంతో గురువారం హైదరాబాద్ మహానగరంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ వైఫల్యాలు, గురుకుల టెండర్లలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ఆరోపణలు రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచాయి. దమ్ముంటే ఆధారాలతో చర్చకు రావాలంటూ మంత్రి జూపల్లి కృష్ణారావుకు సవాల్ విసిరిన కేటీఆర్.. తెలంగాణ భవన్‌లో ఆయన కోసం ప్రత్యేకంగా కుర్చీ వేసి మరీ నిరీక్షించారు. మరోవైపు గన్ పార్కు వద్దకు చర్చకు రావాలన్న 3 మంత్రుల సవాల్‌ను స్వీకరించి ధీమాగా బయలుదేరిన హరీశ్ రావును పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట జరగడం, హరీశ్ రావు కిందపడిపోవడం, ఆ వెంటనే ఆయనను పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లడంతో నగరంలో ఒక్కసారిగా హైడ్రామా నెలకొంది.

వివరాలు 2వ పేజీలో

## నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోం

- పిరికివాళ్లం కాదు.. ఎవరితోపడితే వారితో చర్చించం
- ఆధారాలతో చర్చకు రావాలి
- అవినీతి నిరూపిస్తే రాజీనామా చేస్తాం
- కేసీఆర్ లాగా టెండర్లు ఇవ్వలేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్

2



## చేతగానోళ్లు ఎందుకు సవాళ్లు చేయాలి

బీఆర్ఎస్‌తో చర్చకు కాంగ్రెస్ కు భయం: కేటీఆర్



- పారిపోయిన సీఎం, మంత్రులు!
- తోక ముడిచిన మంత్రి జూపల్లి
- అరెస్టులు చేయించడం దుర్మార్గం
- గన్ పార్క్ వద్ద తొడలు కొడతారా.. దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి!

2

## కిరీటం దొంగల అరెస్టు

వివరాలు వెల్లడించిన ఎస్పీ

3

- బాసర ఆలయ చోరీ కేసు.. అంతర్ రాష్ట్ర దొంగల పట్టివేత
- నాందేడ్ వెళుతుండగా నిందితుల అరెస్టు.. కిరీటం, పట్టీ స్వాధీనం





3

## కళ్లుచెదిరే అక్రమాస్తులు

- ఏసీబీ వలలో డీఎస్పీ భీమ్‌రెడ్డి
- 16 చోట్ల ఏకకాలంలో సోదాలు
- 200 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు

వివరాలు 3లో

## స్మగ్లర్స్ న్యూ ప్లాన్

### స్పీడ్ పోస్టులో గంజాయి డెలివరీ

21 రాష్ట్రాలకు డ్రగ్స్ సరఫరా

3

- పార్శిల్స్‌లో మందుల పేరిట రవాణా
- ముఠాను అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీపీ సజ్జనార్



## మంత్రివర్గ భేటీకి సురేఖ దూరం

- ట్రస్ట్ బోర్డుపై తీవ్ర అసంతృప్తి
- విదేశీ పర్యటన నుంచి వచ్చినా.. తన అభిప్రాయం తీసుకోలేదని ఆవేదన



3

## జర్నలిస్ట్ కేవీఆర్‌కు 14 రోజుల రిమాండ్

చురకలు



# కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదు

**బీఆర్ఎస్ ప్రభుత్వం 7 లక్షల కోట్లు అప్పులు చేసింది**

**నేను చెప్పింది అబద్ధమైతే రాజీనామాకు సిద్ధం : మంత్రి జూపల్లి**



**హైదరాబాద్, జూలై 2 :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. గత ప్రభుత్వం 7.3 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. తాము అప్పులు చేయలేదని మాజీ సీఎం కేసీఆర్ చెప్పాలని జూపల్లి డిమాండ్ చేశారు. తాను చెప్పింది అబద్ధమైతే రాజీనామాకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. కార్పొరేషన్ల పేరుతో అప్పులు చేసి కాళేశ్వరం కట్టామని చెబుతున్నారని, అది నిజమో కాదో చెప్పాలన్నారు. ఇలా అప్పులు చేసి ఎలా తీరుస్తారని, ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఆ అప్పులను రైతుల నుంచి వసూలు చేస్తారా? ఒక్కో రైతు నుంచి 20 లక్షలు వసూలు చేస్తారా అని నిలదీశారు. తాము చేసిన ఆరోపణలపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదన్నారు. తన వద్ద ఉన్న రికార్డులు, కాగితాలు ఇస్తానని, చర్చకు రావాలని జూపల్లి డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ ఇంకా బుకాయిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ చేసిన అప్పులను కేసీఆర్ స్వయంగా మీడియాకు చెప్పాలన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు 6 వేల కోట్ల వడ్డీ కడుతున్నామని వివరించారు. మరోవైపు అప్పులపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానన్న జూపల్లి ఎందుకు రాలేదని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. ఆయన కోసం కేటీఆర్ వేచి చూస్తున్నారని తెలిపారు. చర్చకు సవాల్ విసిరిన మంత్రులు తోక ముడిచి పారిపోయారని విమర్శించారు.

# గూండాయిజం సాగదు!

**బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదు**

**టెండర్ విలువే తక్కువ..ఎక్కువ అవినీతి ఎలా జరుగుతుంది**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, జూలై 2 :** బీఆర్ఎస్ గూండాయిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి బయటపెట్టారని ఆయన పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామనే భ్రమలో బీఆర్ఎస్ నేతలు తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పొంగులేటి మండిపడ్డారు. బీఆర్ఎస్ తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. టెండర్ విలువ కంటే ఎక్కువ అవినీతి ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ఇలాగే ప్రవర్తిస్తే ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని హెచ్చరించారు. ఆ పార్టీ సవాల్‌ను స్వీకరించి మంత్రులు చర్చలకు వెళ్లారని, కానీ బీఆర్ఎస్ నేతలే రాకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చకు సిద్ధమేనని పొంగులేటి సవాల్ విసిరారు.

# ఎలాంటి విమర్శలకైనా సమాధానం చెబుతాం

**బహిరంగ చర్చకు సిద్ధమైన మంత్రులు**

**బీఆర్ఎస్ నేతలు తప్పించుకుంటున్నారు: ఎమ్మెల్యే దానం నాగేందర్**

**హైదరాబాద్, జూలై 2 :** కాంగ్రెస్ మంత్రులకు దమ్ము, ధైర్యం ఉందన్నారని.. అందుకే వారు బహిరంగ చర్చకు ముందుకు వచ్చారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. మంత్రులు పూర్తిగా పారదర్శకంగా పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. గురువారం హైదరాబాద్ గన్ పార్క్ వద్ద దానం నాగేందర్ మాట్లాడారు. తాము తప్పు చేయలేదన్న నమ్మకంతోనే మంత్రులు ప్రజల ముందుకు వచ్చి చర్చకు సిద్ధమయ్యారని చెప్పారు. అలాగే హరీశ్ రావు అండ్ కోను చర్చకు రావాలని కోరితే వారు తప్పించుకుంటున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి విమర్శలకైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని దానం నాగేందర్ స్పష్టం చేశారు. గురుకులాలపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు మంత్రులు ముందుకు వచ్చారని తెలిపారు. కాగా, గురుకులాల నిర్వహణ, అవినీతి ఆరోపణల అంశంపై రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహమ్మద్ అలీ షబ్బీర్ బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావుతో పలు అంశాలపై చర్చించడానికి తాము సిద్ధమని ప్రకటించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులు తొలుత అసెంబ్లీకి బయలుదేరారు. అనంతరం గన్ పార్క్ వద్దకు చేరుకుని తమ సన్నద్ధతను ప్రకటించారు. గురుకులాల వ్యవహారంలో తమ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, అవినీతి ఆరోపణలపై ఎలాంటి చర్చకైనా సిద్ధమని మంత్రులు స్పష్టం చేశారు



# రాజకీయ రణరంగం!

- గురుకుల టెండర్లపై తీవ్ర దుమారం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల సవాళ్లు
- కత్తులు దూసిన అధికార, ప్రతిపక్షాలు
- వేడెక్కిన రాష్ట్ర రాజకీయాలు
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ నిరీక్షణ
- చర్చకు సిద్ధమైన ముగ్గురు మంత్రులు ..అమరవీరుల స్తూపం వద్ద ఎదురుచూపులు
- తోపులాటలో కిందపడ్డ హరీశ్ రావు.. అరెస్టు
- నగరంలో భారీగా పోలీసుల మోహరింపు



**హైదరాబాద్, జూలై 2 :** రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా కాక రేగింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గన్ పార్కు వద్ద చర్చకు రావాలన్న మంత్రుల సవాల్‌ను స్వీకరించి వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్ రావును పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుని అరెస్టు చేయడంతో రాజకీయాలు మరింత వేడెక్కాయి. రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి, అక్రమాలపై లెక్కలతో సహా పక్కాగా వివరిస్తానని, ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. దీనిపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ.. తాను ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌కు వస్తానని ప్రతి సవాల్ విసిరారు. దీంతో మంత్రి కోసం తెలంగాణ భవన్‌లో ప్రత్యేకంగా కుర్చీ వేసి కేటీఆర్ ఎదురుచూశారు. దమ్ముంటే చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు గురుకుల టెండర్లలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో చర్చకు రావాలంటూ 3 మంత్రులు సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన మాజీ మంత్రి హరీశ్ రావు.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గన్ పార్కుకు బయలుదేరారు. కానీ పోలీసులు వారిని తెలంగాణ భవన్ వద్దే అడ్డుకున్నారు. మంత్రులు రమ్మంటేనే తాము వెళ్తున్నామని, ఎందుకు ఆపుతున్నారని పోలీసులను హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కారు దిగి కాలినడకన వెళ్లేందుకు హరీశ్ రావు యత్నించగా తీవ్ర తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఆయన కిందపడిపోయారు. వెంటనే హరీశ్ రావుతో పాటు ఇతర బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. గురుకుల టెండర్లపై చర్చించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు గన్ పార్కుకు చేరుకుని అమరవీరుల స్తూపం దగ్గర కూర్చున్నారు. వీరికి మద్దతుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా అక్కడికి వచ్చారు. ప్రభుత్వమే పోలీసులను అడ్డుపెట్టుకుని చర్చకు రాకుండా పారిపోయిందని, అవినీతి జరిగింది కాబట్టే భయపడుతున్నారని ఈ సందర్భంగా హరీశ్ రావు మండిపడ్డారు. తాము చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపిస్తామని స్పష్టం చేశారు. ఇరు పార్టీల సవాళ్ల నేపథ్యంలో గన్ పార్కు, సోమాజిగూడ ప్రెస్ క్లబ్, తెలంగాణ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోం

- అవినీతి నిరూపిస్తే రాజీనామా చేస్తాం
- ఆధారాలతో ప్రజాప్రతినిధులు చర్చకు రావాలి
- పిరికివాళ్లం కాదు.. ఎవరితోపడితే వారితో చర్చించం
- కేసీఆర్ లాగా టెండర్లు ఇవ్వలేదు
- గురుకుల టెండర్లపై పొన్నం ఫైర్



**హైదరాబాద్, జూలై 2 :** గురుకుల టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై అధికార కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో కన్నెర్రజేసింది. ప్రతిపక్ష నేతల సవాల్‌ను స్వీకరించి చర్చకు సిద్ధమని ప్రకటించిన మంత్రులు.. దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని ప్రతిసవాల్ విసిరారు. నిరూపిస్తే గన్ పార్క్ వద్ద ముక్కు నేలకు రాసి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమంటూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురుకుల టెండర్ల వ్యవహారంలో బీఆర్ఎస్ విసిరిన సవాల్‌తో మంత్రులు గురువారం గన్ పార్క్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. చర్చకు తాము పూర్తిస్థాయిలో సిద్ధమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేవాలయం లాంటి అసెంబ్లీలో హరీశ్ రావు చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. అవసరమైతే ప్రెస్ క్లబ్‌కు కూడా వస్తామని, కానీ రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన వ్యక్తులు మాత్రమే చర్చకు రావాలని ఆయన షరతు విధించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు 12 గంటల్లోగా గన్ పార్క్ దగ్గరకు రావాలని మంత్రి డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడికైనా చర్చకు వస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో లాగా కడప కాంట్రాక్టర్లకు తమ ప్రభుత్వం టెండర్లు ఇవ్వలేదని ఆయన తేల్చిచెప్పారు. తాము అత్యంత పారదర్శకంగా టెండర్లు జరిగేలా చూశామని పేర్కొన్నారు. గురుకుల టెండర్ల కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లు తమకేమైనా చుట్టాలా అని ప్రశ్నించారు. టెండర్లలో అసలు 2 వేల కోట్లు అవినీతి జరిగిందా, లేక 5 వేల కోట్లు జరిగిందా అన్నది బీఆర్ఎస్ నేతలు నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలతో వస్తే తాము చర్చకు సిద్ధమని, అవినీతి జరిగినట్లు నిరూపిస్తే 3 మంత్రులం గన్ పార్క్ దగ్గర ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తామని పొన్నం సవాల్ విసిరారు. తాము పిరికివాళ్లం కాదని, అలాగని ఎవరితో పడితే వారితో చర్చకు రాబోమని తేల్చిచెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ తన గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలని, లేదంటే కేసీఆర్‌కే చెడ్డపేరు వస్తుందని సూచించారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. ఆయన అవినీతి చేసి ఉండొచ్చని, ఆర్ఎస్‌కు తాము సమాధానం చెప్పబోమని స్పష్టం చేశారు. తమ జోలికి వచ్చి ప్రవీణ్ ఇబ్బంది పడొద్దని మంత్రి పొన్నం తీవ్రంగా హెచ్చరించారు.

# చేతగానోళ్లు ఎందుకు సవాళ్లు చేయాలి

- బీఆర్ఎస్‌తో చర్చకు కాంగ్రెస్ కు భయం
- పారిపోయిన సీఎం, మంత్రులు!
- తోక ముడిచిన మంత్రి జూపల్లి
- అరెస్టులు చేయించడం దుర్మార్గం
- గన్ పార్క్ వద్ద తొడలు కొడతారా.. దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి!
- కేటీఆర్ తీవ్ర ఆగ్రహం



**హైదరాబాద్, జూలై 2 :** బీఆర్ఎస్‌తో చర్చకు సిద్ధమని సవాల్ విసిరిన ముఖ్యమంత్రి, మంత్రులు తీరా సమయానికి తోక ముడిచి పారిపోయారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని, 30 నెలల పాలనలో ప్రభుత్వం చేసిన దగా, వైఫల్యాలపై అక్కడే తేల్చుకుందామని ఆయన సవాల్ విసిరారు. ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌కు వచ్చి మంత్రుల కోసం ఎదురుచూశామని కేటీఆర్ తెలిపారు. అసలు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి సవాల్ చేస్తే.. మధ్యలో సందట్లో సడేమియాలా మంత్రి జూపల్లి కృష్ణారావు దూరాడని విమర్శించారు. తీరా ఆయన కోసం భవన్‌లో కుర్చీ వేసి, శాలువాతో సిద్ధంగా ఉన్నా.. చర్చకు రాకుండా పారిపోయి గన్ పార్క్ కు వెళ్లాడని ఎద్దేవా చేశారు. పోనీ తామే అక్కడికి వద్దామంటే పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి రాలేదని గన్ పార్క్ కు బయలుదేరిన మాజీ మంత్రి హరీశ్ రావును, ఇతర నేతలను గేటు దాటక ముందే దుర్మార్గంగా అరెస్టు చేశారని కేటీఆర్ మండిపడ్డారు. కంచన్‌బాగ్‌కు వెళ్లి అరెస్ట్ అయిన నేతలను పరామర్శిద్దామని అనుకుంటే.. తనను కూడా గేటు నుంచి అడుగు బయట పెట్టకుండా పోలీసులు భారీగా మోహరించి అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మంత్రులు అక్కడ కూర్చుని తొడలు కొడితే ప్రయోజనం ఏముందని, ఇక్కడ పోలీసులతో తమను అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మంత్రులు చర్చకు వస్తే రాష్ట్ర ప్రజల ముందు వాస్తవాలన్నీ ఉంచుదామని అనుకున్నామని, కానీ సవాళ్లు స్వీకరించే సత్తా ఈ ముఖ్యమంత్రికి, మంత్రులకు లేదని కేటీఆర్ విమర్శించారు. అవినీతి, అప్పుల మీద బీఆర్ఎస్‌తో చర్చ అంటే ఇంత భయం ఎందుకని ఆయన ప్రశ్నించారు. చేతకాని వాళ్లు ఎందుకు సవాళ్లు చేయాలని నిలదీశారు. ప్రభుత్వానికి నిజంగా దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సెషన్ పెట్టాలని డిమాండ్ చేశారు. 30 నెలల పాలనలో చేసిన దగా, మోసం, వైఫల్యాలతో పాటు అన్ని అంశాలపై అక్కడే చర్చిద్దామని సవాల్ చేశారు. హరీశ్ రావుతో పాటు అరెస్టు చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మూసీ తొలి దశకు గ్రీన్ సిగ్నల్

- పనుల కోసం 7345 కోట్ల కేటాయింపు
- కొత్త చట్టాలపై సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం
- టీచర్లకూ ఇక మధ్యాహ్న భోజన సదుపాయం
- ఆసుపత్రుల్లో 6278 వైద్య పోస్టుల మంజూరు
- కేబినెట్ కీలక నిర్ణయాలు!



**హైదరాబాద్, జులై 2 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు తొలి దశ పనులతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పోస్టుల మంజూరు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం లాంటి విశేష అంశాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ తొలి దశ పనులకు మంత్రివర్గం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవున అభివృద్ధి పనుల కోసం 7345 కోట్లను కేటాయించింది. ఈ ప్రాజెక్టు పనుల నిర్వహణ కోసం కొత్తగా 147 పోస్టుల సృష్టికి, ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకునేందుకు అంగీకారం తెలిపింది.

### కొత్త చట్టాలపై న్యాయపోరాటం..

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా అమల్లోకి తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై (బీఎన్ఎస్) రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. ఈ చట్టాల వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ నివేదించింది. ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ చట్టాన్ని జూలై 1 నుంచి అమలు చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినా.. నిబంధనలపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేయాలని కేబినెట్ నిర్ణయించింది.

### ఉపాధ్యాయులకూ మధ్యాహ్న భోజనం..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విద్యార్థులతో కలిసి ఒకే పంక్తిలో ఉపాధ్యాయులు కూడా భోజనం చేయడం వల్ల పాఠశాలల్లో సమానత్వం పెంపొందడంతో పాటు భోజనం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి వీలవుతుందని అధికారులు భావిస్తున్నారు.

### టిమ్స్ ఆసుపత్రుల్లో పోస్టుల మంజూరు..

కొత్తగా అందుబాటులోకి వస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో భారీ ఎత్తున నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 6278 డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, 4235 ఔట్ సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### విద్యాలయాలు, గోదాములకు భూములు..

రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలకు స్థలాలను కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు కోసం మహబూబ్ నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల భూమిని కేటాయించారు. అలాగే జగిత్యాల జిల్లా చల్గల్ గ్రామంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాలు కేటాయించారు. నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణం కోసం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంటలో 50 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కల్‌పహాడ్ గ్రామంలో 10 ఎకరాల భూమిని కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

# కవిత అరెస్టు!

- ఉప్పల్‌లో ఉద్రిక్తంగా మారిన భూపోరాటం
- బోడుప్పల్‌లో టీఆర్ఎస్ అధ్యక్షురాలిని అడ్డుకున్న పోలీసులు
- ఉద్యమకారులపై పోలీసుల విచక్షణారహిత లాఠీచార్జి
- రక్తం చిందిందంటూ కవిత తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్, జులై 2 :** ఉప్పల్ నియోజకవర్గం బోడుప్పల్‌లో భూపోరాటానికి దిగిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన 250 గజాల స్థలం హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఈ ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం ఉప్పల్ పరిధిలోని బోడుప్పల్‌లో భూ పోరాటానికి టీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా అక్కడికి చేరుకున్న కవితను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో టీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. తోపులాట చోటుచేసుకోవడంతో కవితతో పాటు టీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బొల్లారం పీఎస్ వద్ద టీఆర్ఎస్ చీఫ్ కవిత మాట్లాడుతూ.. మహిళలు, తెలంగాణ ఉద్యమకారులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేశారని మండిపడ్డారు. ఉప్పల్‌లో ఈరోజు తెలంగాణ ఉద్యమకారులు, మహిళల రక్తం చిందిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను మాత్రమే అడిగాం తప్ప వేరే డిమాండ్లు ఏమీ అడగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నేటి నుంచి కౌంట్ డౌన్ షురూ అయిందని ఆమె హెచ్చరించారు. ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల స్థలం ఇవ్వాలని మాత్రమే డిమాండ్ చేశామని తెలిపారు. ఇచ్చిన హామీలు అడిగితే ఉద్యమకారులపై లాఠీచార్జి చేసి రక్తం చిందించడం అన్యాయమన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రతి రోజూ హామీలను గుర్తుచేస్తూనే ఉంటామని కవిత స్పష్టం చేశారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భూపోరాటానికి కవిత పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే, భూపోరాటానికి వెళ్తున్నారనే సమాచారంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు ఎక్కడికక్కడే ముందస్తు అరెస్టులు చేశారు. పోలీసుల తీరుపై ఆ పార్టీ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు.



# కిరీటం దొంగల అరెస్టు!

**బాసర ఆలయ చోరీ కేసు.. అంతర్ రాష్ట్ర దొంగల పట్టివేత**

**నాందేడ్ వెళుతుండగా నిందితుల అరెస్టు.. కిరీటం, పట్టీ స్వాధీనం**

**వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి**




**నిర్మల్, జులై 2 :** ఎంతో పవిత్రమైన బాసర అమ్మవారి ఆలయంలో చోరీకి పాల్పడిన అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి అమ్మవారి వెండి కిరీటం, వెండి పట్టీ స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల ప్రకటించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం ఆమె మీడియాతో పంచుకున్నారు. బాసర ఆలయంలో పెద్ద వెండి కిరీటం దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు రాగానే విచారణ చేపట్టామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఇది అంతర్ రాష్ట్ర దొంగల పనిగా గుర్తించినట్లు వెల్లడించారు. ఈ చోరీకి పాల్పడింది పల్లపు ఏడుకొండలు, గైని రామకృష్ణ, కొడమ ఆనంద్ అని ఆమె స్పష్టం చేశారు. రైల్వే సౌకర్యం ఉన్న ప్రాంతాల్లోని ఆలయాల్లో చోరీ చేయడం వీళ్ల ప్రత్యేకత అని వివరించారు. బాసర ఆలయంలో చోరీ జరిగిన వెంటనే దొంగల గాలింపు కోసం 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, అత్యంత వేగంగా కేసును ఛేదించామని ఎస్పీ వివరించారు. దొంగిలించిన వస్తువులను అమ్మడం కోసం రైలులో నాందేడ్ వెళుతుండగా నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 1 కిలో 220 గ్రాముల వెండి కిరీటం, 260 గ్రాముల వెండి పట్టీ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. చాలా తక్కువ సమయంలోనే ఎంతో చాకచక్యంగా దొంగలను పట్టుకుని, వస్తువులను రికవరీ చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా వారికి ప్రోత్సాహకాలు అందజేశారు.

# మంత్రి సురేఖ గైర్హాజరు!

**మంత్రివర్గ భేటీకి సురేఖ దూరం.. ట్రస్ట్ బోర్డుపై తీవ్ర అసంతృప్తి**

**విదేశీ పర్యటన నుంచి వచ్చినా.. తన అభిప్రాయం తీసుకోలేదని ఆవేదన**

**హైదరాబాద్, జులై 2 :** రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి నూతన ట్రస్ట్ బోర్డు ఏర్పాటు వ్యవహారమే ఆమె అసంతృప్తికి కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశానికి మంత్రి కొండా సురేఖ హాజరుకాలేదు. విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చినప్పటికీ.. ఆమె కేబినెట్ భేటీకి రాకపోవడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయని అంతా భావిస్తున్నారు. సచివాలయ వర్గాలతో పాటు రాజకీయంగానూ దీనిపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

### ట్రస్ట్ బోర్డు వ్యవహారమే..

ప్రధానంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన వ్యవహారమే మంత్రి సురేఖ అసంతృప్తికి కారణమని తెలుస్తోంది. తన శాఖకు సంబంధించిన అత్యంత కీలకమైన ఈ బోర్డు ఏర్పాటులో.. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తన అభిప్రాయాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదనే భావనతో ఆమె ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో తీవ్ర అలిగిన కారణంగానే కొండా సురేఖ ఉద్దేశపూర్వకంగానే మంత్రివర్గ సమావేశానికి దూరంగా ఉన్నారని సచివాలయ వర్గాల్లో గట్టిగా చర్చ నడుస్తోంది.

# జర్నలిస్ట్ కేవీఆర్‌కు 14 రోజుల రిమాండ్

**విజయనగరం, జులై 2 :** సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన తెలంగాణ జర్నలిస్ట్ కే వెంకటరామిరెడ్డికి (కేవీఆర్) కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. హైదరాబాద్‌లో అరెస్టు చేసిన ఆయనను బడంగి పోలీసులు విజయనగరం జిల్లా బొబ్బిలి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఈ తీర్పు వెలువరించారు. సీఎం, డిప్యూటీ సీఎంలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో జర్నలిస్ట్ కేవీఆర్‌ను బడంగి పోలీసులు విజయనగరం జిల్లా బొబ్బిలి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆయనకు ఈ నెల 14 వరకు రిమాండ్ విధించారు. దీంతో కేవీఆర్‌ను బొబ్బిలి జైలుకు తరలించారు. విజయనగరం జిల్లా బడంగి మాజీ సర్పంచ్ కంది రమేష్ ఫిర్యాదు మేరకు కేవీఆర్‌ను హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో బడంగి పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. భారత రాజ్యాంగంతో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లపై కేవీఆర్ అసభ్యకర వ్యాఖ్యలు చేశారని రమేష్ ఏప్రిల్ 10 న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేవీఆర్‌ను బొబ్బిలి పోలీస్ స్టేషన్‌కు బుధవారం తీసుకొచ్చారు.

# కళ్లుచెదిరే అక్రమాస్తులు

**ఏసీబీ వలలో డీఎస్పీ భీమ్‌రెడ్డి** | **200 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు**

**16 చోట్ల ఏకకాలంలో సోదాలు** | **భారీగా నగదు, బంగారం సీజ్**



**హైదరాబాద్ జులై 2 :** ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించిన కేసులో డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. పోలీసు కంప్యూటర్ సర్వీసెస్ (పీసీఎస్) విభాగంలో పనిచేస్తున్న ఆయన అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో గురువారం ఏకకాలంలో 16 చోట్ల సోదాలు నిర్వహించి కళ్లుచెదిరే ఆస్తులను గుర్తించారు. నార్సింగిలోని భీమ్‌రెడ్డి ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన దాడుల్లో భారీ ఎత్తున విల్లాలు, ఇళ్లు, ప్లాట్లు, కమర్షియల్ స్పేస్‌లు, వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణతో పాటు కర్ణాటకలోనూ ఆయనకు వ్యవసాయ భూములు ఉన్నట్లు గుర్తించారు. ఆయన ఇంట్లో స్థిరాస్తుల పత్రాలతో పాటు 43.06 లక్షల నగదు, దాదాపు 2 కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులు, 23 విదేశీ మద్యం బాటిళ్లను అధికారులు సీజ్ చేశారు. సోదాల సమయంలో దొరికిన మద్యం బాటిళ్లపై ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించారు. ఇబ్రహీంబాగ్‌లోని వెస్సెల్లా మెడోస్‌లో విల్లా, టెలికాంనగర్‌లో జీ ప్లస్ 2 ఇంటితో పాటు ఒక ప్లాట్, గచ్చిబౌలిలో ఒక ప్లాట్, మణికొండలో 500 గజాల 5 కమర్షియల్ కాంప్లెక్స్‌లో వాటా, 3000 చదరపు అడుగుల కమర్షియల్ స్పేస్‌లను ఏసీబీ అధికారులు గుర్తించారు. తెల్లాపూర్‌లో 2 ప్లాట్లు, ప్రగతి రిసార్ట్స్ సమీపంలో 500 గజాల ప్లాట్, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 3.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. కర్ణాటకలో వేర్వేరు చోట్ల దాదాపు 45 ఎకరాల భూములు ఉన్నట్లు పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నాగోల్ కామినేని ఆసుపత్రి సమీపంలో 200 గజాల ప్లాట్, పటాన్‌చెరు జీపీఆర్ హౌసింగ్ సొసైటీ సమీపంలో 400 గజాల ప్లాట్, పటాన్‌చెరులో మరో 200 గజాల ప్లాట్ ఉన్నట్లు గుర్తించారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్‌లో 1000 గజాల స్థలం, 2 ఎకరాల వ్యవసాయ భూమి, శ్రీ రాఘవేంద్ర రాక్స్ అండ్ మినరల్స్‌లో 75 లక్షల పెట్టుబడి, వికారాబాద్ జిల్లాలో 4.20 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు గుర్తించారు. డీఎస్పీ బ్యాంకు ఖాతాల్లో 19.91 లక్షల నిల్వలు ఉన్నట్లు తేల్చారు. భీమ్‌రెడ్డి తన చట్టబద్ధమైన ఆదాయ వనరులకు మించి అవినీతి, అక్రమ మార్గాల ద్వారా భారీగా ఆస్తులు కూడబెట్టారని ఏసీబీ స్పష్టం చేసింది. ఈ ఆస్తుల అసలు మార్కెట్ విలువ డాక్యుమెంట్లలో చూపిన దానికంటే చాలా రెట్లు (దాదాపు 200 కోట్లకు పైగా) ఎక్కువే ఉంటుందని అధికారులు వెల్లడించారు. భీమ్‌రెడ్డిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# స్మగ్లర్ల కొత్త రూట్!

**స్పీడ్ పోస్టులో గంజాయి డెలివరీ** | **పార్శిల్స్‌లో మందుల పేరిట**



**రవాణా**

**ముఠాను అరెస్టు చేసిన పోలీసులు** | **వివరాలు వెల్లడించిన సీపీ సజ్జనార్**

**హైదరాబాద్ జులై 2 :** దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్టు, కొరియర్ పార్శిల్స్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న కిలాడీ ముఠాను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. 21 రాష్ట్రాలకు వాట్సాప్ కోడ్స్ ద్వారా ఆన్‌లైన్ ఆర్డర్లు తీసుకుని డోర్ డెలివరీ చేస్తున్న ఈ ముఠా వివరాలను నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ గురువారం మీడియాతో పంచుకున్నారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అనుమానాస్పద పార్శిల్స్‌పై దర్యాప్తు చేయగా ఈ గంజాయి ముఠా గుట్టు రట్టయిందని సీపీ సజ్జనార్ తెలిపారు. అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రా అనే ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చే స్పీడ్ పోస్టు పార్శిల్స్‌కు స్కానింగ్ లేకపోవడంతో వీరికి సరఫరా సులభంగా మారిందని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర శాఖలకు లేఖ రాస్తామని, నగరంలోని కొరియర్ సంస్థలన్నీ పార్శిల్స్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశించారు.

### మందుల పేరిట మోసం..

నిందితుడు సత్యం మిశ్రా 2018 నుంచి గంజాయికి అలవాటు పడి రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌లతో కలిసి ఒక సిండికేట్‌గా ఏర్పడ్డాడు. సొంత ఊరిలో రైతుల ద్వారా గంజాయి పండించి కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పార్శిల్స్‌లో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని సీపీ తెలిపారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు లాంటి పలు ప్రధాన నగరాలకు స్పీడ్ పోస్టు ద్వారా గంజాయి పంపుతున్నారని వివరించారు. అనుమానాస్పద పార్శిల్స్ వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### ఏటా కోట్లలో టర్నోవర్..

సరఫరాదారులు, కస్టమర్ల మధ్య వాట్సాప్‌లో కోడ్స్ ద్వారా ఆర్డర్లు జరుగుతాయని, యూపీఐ ద్వారా నగదు లావాదేవీలు చేస్తున్నారని పోలీసులు గుర్తించారు. రోజుకు 80 నుంచి 100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్టు ద్వారా డెలివరీ చేస్తున్నారు. ఒక్కో పార్శిల్‌లో 50 నుంచి 250 గ్రాముల గంజాయి ఉంచుతూ విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్‌ను 1500 నుంచి 8000 వరకు అమ్ముతూ.. రోజుకు 1 లక్షకు పైగా ఆదాయం

చురకలు

శుక్రవారం 03 జూలై 2026



# తెలంగాణలో సవాళ్ల రాజకీయాలు!

## రెండేళ్ల ముందే ఎన్నికల వేడి..

**రేవంత్, కేటీఆర్ సవాల్-ప్రతిసవాళ్లతో పీక్‌కు చేరిన పొలిటికల్ హీట్!**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్లు ప్రతిసవాళ్లతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీని ఎండగట్టడమే పనిగా బిఆర్ఎస్ పనిచేస్తోంది. విపక్ష బిఆర్ఎస్ లక్ష్యంగా ఈ మధ్య సిఎం రేవంత్ కూడా ఘాటుగానే దాడి చేస్తున్నారు. ఎపిలో కూడా దాదాపు ఇదే తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. జగన్ పార్టీని గొడ్డలి పార్టీ అంటూ అధికార టిడిపి దుమ్మెత్తి పోస్తోంది. జగన్ కూడా ఎపిలో చట్టాలకు విలువ లేకుండా పోయిందని అంటున్నారు. మొత్తంగా అభివృద్ధి, ప్రజల అవసరాలు పక్కకు పోయాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. తమ రాజకీయం కోసం రాష్ట్ర అభివృద్ధిని, పాలనను పక్కన పెట్టారు. ఇకపోతే తెలంగాణలో అంతకుమించి అన్నట్లుగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పుడే ఎన్నికలు లేవు. మరో రెండేళ్ల సమయం ఉంది. అయినా అప్పుడే ఎన్నికల వేడి పుట్టించేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది రెండున్నరేండ్ల చెత్త పాలన అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావులు విమర్శలు గుప్పిస్తున్నారు. బిఆర్ఎస్ అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేసిందని సిఎం రేవంత్ సహా మంత్రులు అడపాదడపా విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాల పై లెక్కలతో పక్కాగా వివరిస్తామని ప్రతిగా బిఆర్ఎస్ నేతలు సవాళ్లు విసరుతున్నారు. అసెంబ్లీ లేకపోతే వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనావైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని కెటిఆర్ చాలెంజ్ చేశారు.కాగా,కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్దమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఇలా రోజుకో సవాల్, ప్రతి సవాల్‌లో రాజకీయాలు నడుస్తున్నాయి. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు అడపాదడపా బిజెపి, బిఆర్ఎస్‌లను లక్ష్యంగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నా, అప్పుడే ఎలక్షన్ మూడ్ వచ్చేస్తున్నట్టు కనిపిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు అదే తరహా ప్లానింగ్‌లో ఉన్నాయి. అందునా అధికారంలో ఉన్నాం కాబట్టి ఎక్కడా తగ్గకూడదన్న ఉద్దేశ్యం కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టేందుకు అవసరమైన ఎత్తుగడలకు ఆయన పదును పెడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే మళ్లీ కాంగ్రెస్ సర్కార్ వస్తుందని, తానే సిఎంనని పదేపదే ప్రకటిస్తున్నారు. ఇదంతాఓక ఎత్తయితే విపక్ష బిఆర్ఎస్, బిజెపిలను దెబ్బకొట్టడంతో పాటు, బలంగా లేని చోట కాంగ్రెస్‌ను బలోపతేం చేసే పనిలో పడ్డారని తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ ఎక్కడైతే బలంగా లేదో అక్కడి నుంచే కార్యాచరణ మొదలు పెట్టాలని రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టడానికి అక్కడి నుంచే యుద్ధం ప్రారంభించాలని సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో దీనికి సంబంధించిన చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి. వచ్చే డిసెంబర్ నుంచి తన పొలిటికల్ స్కెచ్‌ని అమలు చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు ఇప్పటినుంచి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తానని ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో ఉన్నారన్నది పొలిటికల్ టాక్. డిసెంబర్ తర్వాత పూర్తిగా గ్రౌండ్‌లోనే ఉండాలని రేవంత్ డిసైడ్ అయినట్టు కనపడుతోంది. అందుకోసం ప్రధానంగా ఉత్తర తెలంగాణ మీద ఫోకస్ పెట్టబోతున్నారట. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టుంది. గత ఎన్నికల్లో ఆ విషయం నిరూపితమైంది కూడా. కానీ, ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడుతున్నందున ఇక అక్కడ ఫోకస్ చేయాలన్నది సీఎం ప్లాన్‌గా తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుండి తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో భాగంగా బస్సు యాత్ర లేదంటే పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, రాజకీయ ఎత్తుగడల్ని అక్కడి నుంచే అమలు చేయాలని భావిస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్, బీజేపీల కట్టడిని అక్కడి నుంచే మొదలుపెట్టాలనుకుంటున్నట్లు అర్థం అవుతోంది. . ఓట్ బ్యాంకును పెంచుకోవడంతో పాటు,తన రెండున్నరేళ్ళ పాలన, గత బీఆర్ఎస్ పాలనపై చర్చకు పెట్టడంతో పాటు కేంద్రంలోని బీజేపీ తీరు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కూడా ప్రజలు మాట్లాడుకునేలా చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించారు రేవంత్‌రెడ్డి. అది ఎలా ఉన్నా విపక్ష పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఏకంగా రెండు పార్టీలపై దాడిని ముమ్మరం చేశారు. దీంతో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. .

# యూజర్‌నేమ్ ఫీచర్‌పై వాట్సాప్ క్లారిటీ

- ఇంకా అమల్లోకి రాలేదు.. దశలవారీగా అందుబాటులోకి
- యూజర్‌నేమ్ ఉన్నా మొబైల్ నంబర్ తప్పనిసరే
- కేంద్రం ఆందోళనలకు మెటా సంస్థ వివరణ




**న్యూఢిల్లీ, జూలై 2:** వాట్సాప్‌లో ప్రవేశపెట్టనున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాల నేపథ్యంలో మెటా సంస్థకు చెందిన వాట్సాప్ కీలక వివరణ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫీచర్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురాలేదని, కేవలం యూజర్‌నేమ్‌ను ముందస్తుగా రిజర్వ్ చేసుకునే అవకాశమే కల్పించామని స్పష్టం చేసింది. ఈ ఏడాది చివరి నాటికి దశలవారీగా ఈ ఫీచర్‌ను అమల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. యూజర్‌నేమ్ ఫీచర్ ద్వారా కొత్త వ్యక్తులు లేదా గ్రూపులతో మొబైల్ నంబర్‌ను వెల్లడించకుండా సంభాషించే అవకాశం ఉంటుందని వాట్సాప్ తెలిపింది. అయితే ఈ ఫీచర్‌ను ఉపయోగించడం పూర్తిగా వినియోగదారుల ఇష్టమని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యూజర్‌నేమ్ సృష్టించాల్సిన అవసరం లేదని పేర్కొంది. వాట్సాప్ సేవలను ఉపయోగించేందుకు మొబైల్ నంబర్ మాత్రం ఎప్పటికీ తప్పనిసరిగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ఇప్పటికే ఉన్న యూజర్‌నేమ్‌లను ఆయా ఖాతాదారుల కోసం రిజర్వ్ చేస్తామని, ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, ధ్రువీకరించబడిన ఖాతాలకు సంబంధించిన పేర్లు దుర్వినియోగం కాకుండా ప్రత్యేక రక్షణ కల్పిస్తామని తెలిపింది. ఒకవేళ కోరుకున్న పేరు ఇప్పటికే వినియోగంలో ఉంటే ప్రత్యామ్నాయ యూజర్‌నేమ్‌లను సూచించే ప్రత్యేక వ్యవస్థను అందుబాటులో ఉంచనున్నట్లు వివరించింది. యూజర్‌-నేమ్‌లను నేరుగా వెతికే అవకాశం ఉండదని వాట్సాప్ స్పష్టం చేసింది. కొత్త వ్యక్తి నుంచి సందేశం వచ్చినప్పుడు అతని దేశం, ఖాతా వివరాలు, భద్రతా హెచ్చరికలు వంటి సమాచారం చూపించే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే అమల్లో ఉన్న బ్లాక్, రిపోర్ట్ వంటి భద్రతా సదుపాయాలు కొనసాగుతాయని పేర్కొంది. అదనపు భద్రత కోసం యూజర్‌నేమ్ కీ అనే కొత్త వ్యవస్థను కూడా ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించింది. దీనిని వినియోగదారులు అవసరమైతే ఎప్పుడైనా మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. యూజర్‌నేమ్ ఫీచర్ కారణంగా నకిలీ గుర్తింపులు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆర్థిక మోసాలు పెరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు, ఆర్థిక సంస్థలు, ప్రజాప్రతినిధుల పేర్లను పోలిన యూజర్‌నేమ్‌ల దుర్వినియోగాన్ని అరికట్టే వరకు ఈ ఫీచర్‌ను అమలు చేయవద్దని వాట్సాప్‌కు సూచించింది. అలాగే భద్రతా చర్యలపై మూడు రోజుల్లో పూర్తి నివేదిక సమర్పించాలని నోటీసు జారీ చేసింది. దీనికి స్పందించిన వాట్సాప్, ప్రస్తుతం యూజర్‌నేమ్ ఆధారిత మెసేజింగ్ సేవ ప్రారంభం కాలేదని, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అన్ని రక్షణ చర్యలతోనే ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేసింది.




# అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

**తొలి బృందానికి చందర్‌కోట్ వద్ద స్వాగతం**

**శ్రీనగర్, జూలై 2:** హిమాలయాల్లో వెలిసిన పవిత్ర అమర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర ప్రారంభమైంది. క్షేత్ర దర్శనానికి బాల్తాల్ రూట్ లో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం లభించింది. రాంబన్ జిల్లా యంత్రాంగం, సివిల్ సొసైటీ సభ్యులు, వివిధ సంస్థలు భక్తులకు ఆత్మీయ ఆతిథ్యంతో స్వాగతం పలికాయి. అంతకుముందు, జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ వార్షిక యాత్ర కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. భక్తులను స్వాగతించిన వారిలో డీఐజీ సర్గ్గాన్ శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ట్రాఫిక్ ఎస్ఎస్పీ రాజా ఆదిల్ హమీద్ సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. తర్వాత, భక్తులు బస చేసే మొదటి ప్రధాన కేంద్రం చందర్‌కోట్. ఈ పవిత్ర యాత్ర సాఫీగా, సురక్షితంగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టింది. చందర్‌కోట్ లంగర్ సైట్ వద్ద భక్తులకు అవసరమైన వసతులు, భోజన సదుపాయాలను సిద్ధం చేశారు.

# అయోధ్య విరాళాల వివాదంలో మరో మలుపు!



- చంపత్ రాయ్‌పై పోలీసులకు ఫిర్యాదు
- అనిల్ మిశ్రా సహా నలుగురిపై కేసు నమోదు చేయాలని న్యాయవాదుల డిమాండ్
- జులై 6న ట్రస్ట్ అత్యవసర సమావేశం..
- కీలక నిర్ణయాలపై ఉత్కంఠ

**అయోధ్య, జులై 2 :** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో విరాళాల దుర్వినియోగం వ్యవహారం మరింత ముదురుతోంది. ఇప్పటికే ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేసిన నేపథ్యంలో గురువారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ది బార్ అసోసియేషన్ ఆఫ్ ఫైజాబాద్ తరఫున న్యాయవాదులు చంపత్ రాయ్‌తో పాటు అనిల్ మిశ్రా, కృష్ణ దేవ్, గోపాల్ రావ్‌లపై అయోధ్యలోని రామజన్మభూమి పోలీస్ స్టేషన్‌లో లిఖితపూ-ర్వక ఫిర్యాదు చేశారు. ఫైజాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాళికా శరణ్ మిశ్రా మాట్లాడుతూ, నిందితులపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరామని తెలిపారు. ఫిర్యాదు స్వీకరణకు సంబంధించిన కాపీ ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అయితే రామమందిరం విరాళాల వ్యవహారంలో దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. విరాళాల లెక్కింపులో అక్రమాలు జరిగాయంటూ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. అనంతరం పలువురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, విరాళాల లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎనిమిది మంది ఉద్యోగులను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా చంపత్ రాయ్ వాంగ్మూలాన్ని కూడా సిట్ అధికారులు నమోదు చేశారు. ఇక జులై 6న అయోధ్యలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అత్యవసర సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలో రెండు మూడొంతుల మెజారిటీతో చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల భవితవ్యంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సిట్ నివేదిక ఆధారంగా ట్రస్ట్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశముందని సమాచారం.

# జపాన్ ప్రధాని నా అందమైన చెల్లెలు

- మోదీ ఆప్యాయతకు తకాయిచీ ఫిదా
- భారత్-జపాన్ బంధానికి కొత్త ఊపు
- రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- ఫార్మా, రక్షణ, కృత్రిమ మేధస్సు రంగాల్లో కీలక ఒప్పందాలు



**న్యూఢిల్లీ, జులై 3 :** భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయె తకాయిచీకి ఆత్మీయ స్వాగతం పలికారు. ఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో తకాయిచీని ఉద్దేశించి "నా అందమైన చెల్లెలు" అని సంబోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోదీ చూపిన ఆప్యాయతకు చిరునవ్వుతో స్పందించిన తకాయిచీ, తనను "అందమైన చెల్లెలు"గా సంబోధించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భారత్--జపాన్ 16వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాలు వ్యాపారం, రక్షణ, ఔషధ తయారీ, కృత్రిమ మేధస్సు, పెట్టుబడులు తదితర కీలక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వచ్చే పదేళ్లలో సుమారు రూ. 6 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని నిర్ణయించాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, భారత్‌ను తొలిసారిగా అధికారికంగా సందర్శిస్తున్న జపాన్ తొలి మహిళా ప్రధాని సనాయె తకాయిచీకి స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. ఆమె దూరదృష్టి కలిగిన నాయకురాలని ప్రశంసించారు. ఇరు దేశాల ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమావేశం కీలకమని పేర్కొన్నారు. మూడు రోజుల పర్యటన కోసం బుధవారం భారత్‌కు చేరుకున్న తకాయిచీ, ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో విస్తృత స్థాయి చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రత, ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై ఇరు దేశాల నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్ చేరుకున్న అనంతరం తకాయిచీ తన పర్యటనకు సంబంధించిన చిత్రాలను సామాజిక మాధ్యమంలో పంచుకోగా, ప్రధాని మోదీ స్పందిస్తూ ఆమెకు హృదయపూర్వక స్వాగతం పలికారు. భారత్-జపాన్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ సమావేశం కొత్త దిశను చూపుతుందని, ఉమ్మడి కృషితో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, సమృద్ధిని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

చురకలు



# ఆపదలో బాలికలకు "షీ" టీమ్ అండగా ఉంటుంది

- "షీ" టీమ్ పోలీసులు
- విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన,ఆత్మరక్షణపై సూచనలు
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు



**నారాయణపేట, జులై,02:**

జిల్లా కేంద్రంలోని మార్కెట్ లైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో "షీ" టీమ్ పోలీసులు సామాజిక అంశాలు, మహిళల భద్రత, చట్టపరమైన రక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాల నివారణ, వేధింపులపై ఫిర్యాదు చేసే విధానం గురించి వివరించారు.ఈ సందర్భంగా "షీ" టీమ్ పోలీసులు కవిత, జ్యోతి లు మాట్లాడుతూ... మహిళలు, బాలికల భద్రతకు తెలంగాణ పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాలు, సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే "షీ" టీమ్‌ను సంప్రదించాలని సూచించారు.ఎవరైనా ఈవ్ టీజింగ్, వెంటపడటం, అసభ్యకరంగా మాట్లాడటం, సోషల్ మీడియాలో వేధించడం, అసభ్య సందేశాలు పంపడం లేదా ఇతర రూపాల్లో ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే షీ టీమ్ మొబైల్ నంబర్ 8712670398కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కుటుంబ సభ్యులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, "షీ" టీమ్ పోలీసులు బాలరాజు, చెనప్ప, విద్యార్థినులు పాల్గొన్నారు.

# అధికారుల మాట నమ్మి ఇల్లు కూల్చింది

- ఇప్పుడు నిలువ నీడ లేక అవస్థలు.
- ఇందిరమ్మ ఇల్లుకోసం ఆశగా ఎదురుచూపు.



**రాయపోల్,జూలై 2:**

అధికారుల సూచనలను నమ్మి ఉన్న ఏకైక పాత ఇంటిని కూల్చివేసిన ఓ మహిళకు ఎనిమిది నెలలు గడిచినా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాకపోవడంతో నిలువ నీడ లేక అవస్థలు పడుతున్న ఘటన మండల కేంద్రం రాయపోల్‌లో వెలుగుచూసింది.

రాయపోల్ గ్రామానికి చెందిన ఉషణగళ్ల కవిత తెలిపిన వివరాల ప్రకారం.. మొదటి విడతలో తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని అధికారులు చెప్పడంతో, కొత్త ఇంటి నిర్మాణం కోసం పాత ఇంటిని కూల్చివేయాలని సూచించారు. అధికారుల మాట నమ్మి ఉన్న ఇంటిని పూర్తిగా కూల్చివేశారు. అనంతరం ఇంటి స్థలంలో గుర్తులు (ముగ్గు) వేయడానికి వచ్చిన అధికారులు, ఆన్‌లైన్‌లో పేరు మిస్సైందని చెప్పి వెళ్లిపోయారు. అప్పటి నుంచి సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని కవిత ఆరోపించారు. ఇల్లు కూల్చివేసి దాదాపు ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని, అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల నివాసం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆన్‌లైన్‌లో నమోదైన లోపాన్ని వెంటనే సరిచేసి తమకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని అందజేసి న్యాయం చేయాలని బాధితురాలు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు.

# నగరం ముంపు నివారణకు స్ట్రాం వాటర్ డ్రైన్ల ఏర్పాటుపై సమీక్ష

**వరంగల్, జూలై 2:.**

నగరంలో వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా స్ట్రాం వాటర్ డ్రైన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం శుబ్ కన్సల్టెంట్ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ ప్రతినిధులు నగరంలో చేపట్టిన సర్వే వివరాలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జలవనరులు, బొంది వాగు, వడ్డేపల్లి చెరువు, బాటిల్‌నెక్ ప్రాంతాలు, స్ట్రాం వాటర్ డ్రైన్ల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ, ప్రైవేటు భూములు, పరిహారం అంశాలు, ఇరుకైన ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, కన్సల్టెంట్ ప్రతినిధి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ పట్టణంలో విస్తృత ప్రత్యేక తనిఖీలు

- గంజాయి స్వాధీనం, వాహనాల స్వాధీనం – ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు,




**వికారాబాద్, జులై,02:**

వికారాబాద్ డీఎస్పీ పర్యవేక్షణలో రాత్రి వికారాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, నిర్మానుష్య ప్రాంతాలు, రాత్రి వేళల్లో తెరిచి ఉన్న దుకాణాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడినాయి. ఈ తనిఖీలలో వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్ , ఐదుగురు సబ్-ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, క్విక్ రెస్పాన్స్ టీమ్ (QRT) సభ్యులు పాల్గొని Populan Device సహాయంతో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా బస్ స్టాండ్ సమీపంలో సుమారు 15 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. అలాగే వాహనాలకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే పత్రాలను చూపించలేకపోయిన ఎనిమిది ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, మోటార్ వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు.ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, మాదకద్రవ్యాల రవాణా మరియు వినియోగాన్ని నియంత్రించడం,దొంగతనాలు, ఇతర నేరాలను నివారించడం, ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా చర్యలు చేపట్టడం జరిగింది అని వికారాబాద్ డీఎస్పీ అంజయ్య తెలిపినారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు వికారాబాద్ సబ్ డివిజన్ పోలీసులు నిరంతరం కట్టుబడి పనిచేస్తున్నారని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని తెలిపినారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందని డీఎస్పీ అంజయ్య తెలిపారు.

# కామ్రేడ్ కోలా శంకర్ ఆశయాల సాధనకు ఉద్యమాలే మార్గం

- కొలనుపాకలో 36వ వర్ధంతి సభ.. విద్యా హక్కుల పరిరక్షణకు పోరాటం చేయాలని పిలుపు



**ఆలేరు, జూలై 2:**

విద్యార్థులు, యువజనులు, రైతులు, కూలీల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన అమరజీవి కామ్రేడ్ కోలా శంకర్ ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కోలా శంకర్ 36వ వర్ధంతి సందర్భంగా ఆలేరు మండలం కొలనుపాకలో గురువారం ఘనంగా వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మామిడాల ప్రవీణ్ జెండా ఆవిష్కరించగా, అనంతరం కోలా శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు రైతులు, వ్యవసాయ కార్మికులు, శ్రామిక ప్రజల హక్కుల కోసం కోలా శంకర్ నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై ఆయన చూపిన నిబద్ధతను తట్టుకోలేక అప్పటి ఆర్ఎస్‌యూకు చెందిన వ్యక్తులు కిరాతకంగా హత్య చేశారని పేర్కొన్నారు. వ్యక్తిని హత్య చేయగలిగినా, ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ఎవరూ అంతం చేయలేరని అన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ దిశగా తీసుకెళ్తున్నాయని విమర్శించారు. విద్య హక్కును పరిరక్షించేందుకు, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందేలా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామిక విలువలను కాపాడడంలో విద్యార్థి ఉద్యమాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. అమరుల త్యాగాలను జయంతులు, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, వారు చూపిన పోరాట మార్గంలో నడిచినప్పుడే వారి ఆశయాలను సాకారం చేయగలమన్నారు. విద్యా రంగ సమస్యలు, నిరుద్యోగం, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా యువత పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ ఉదయ్, ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు మామిడాల సోమయ్య, జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, పీఓడబ్ల్యూతో పాటు ఐఎఫ్‌టీయూ, పీవైఎల్, అరుణోదయ తదితర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేత

### రాజానగరం పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**ఆలేరు, జూలై 2 :**

విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి తోడ్పాటుగా రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆలేరు మండలం రాజానగరం ప్రభుత్వ పాఠశాలలో గురువారం నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కంపరాజు వెంకటేశ్వర రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం అభినందనీయమైన కార్యక్రమమని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు ఉపయోగపడతాయని అన్నారు. ప్రధానోపాధ్యాయులు హేమలత మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు అందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ ఖాజా, రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు గుండ్రాజు నరసింహ రాజు, కొత్వాల్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ముందస్తు అరెస్టు

### పోలీసుల అదుపులో ఉద్యమకారులు




**ఆలేరు, జులై 02:**

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు హామీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్ ఉప్పల్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమంనకు బయలుదేరిన ఆలేరు పట్టణ ఉద్యమకారులను ఆలేరు పోలీసులు అదుపులో తీసుకున్నారు. పోలీసులు తమను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ, అక్రమ అరెస్టులతో ఉద్యమాల్ని ఆపలేరని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మలిదశ ఉద్యమకారుల కమిటీ వేయడం జరిగిందని, కానీ కమిటీ హామీల అమలులో కదలిక లేదని, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు హామీ ఇచ్చిన ప్రకారం ఉద్యమకారులను గుర్తించి ఉద్యమకారులకు 250 గజాల స్థలము, పెన్షన్ సౌకర్యం, హెల్త్ కార్డు వెంటనే ఇచ్చి అమలు చేయాలని డిమాండ్ చేసారు. తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో రాబోయే రోజుల్లో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల హక్కుల సాధనకై పెద్ద ఎత్తున ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని తెలియపరచుచున్నాము. అరెస్ట్ అయిన వారిలో పసుపు నూరి వీరేశం, రాచకొండ జనార్ధన్, చెక్క వెంకటేష్, తమ్మిడి పద్మారావు, బడుగు జహంగీర్ ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

### రూ.3 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేత



**ఆలేరు, జూలై 2:**

ఆలేరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన ఏదుల వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పారునంది భాస్కర్ మృతుడి కుటుంబానికి మూడు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి ధైర్యం చెప్పారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి తరపున 50 కిలోల బియ్యాన్ని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పార్టీ తరపున కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు గ్రామ సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గాజుల ఆంజనేయులు, వార్డు సభ్యులు మస్తాన్, పార్టీ నాయకులు గ్యాదపాక మల్లేష్, లక్ష్మయ్య, గణేష్, బాలరాజు, నర్సింగ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో యూరియా కొరత లేదు

**ఖమ్మం, జూలై 2:.**

ఖమ్మం జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 17,156.88 మెట్రిక్ టన్నుల (3.81 లక్షల బస్తాలు) యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియా యాప్ ద్వారా 56,926 మంది రైతులు బుకింగ్ చేసుకోగా, 1.60 లక్షల బస్తాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు అపోహలకు గురికాకుండా అవసరమైన మేరకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని, జిల్లాలో ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు.

# ఆలేరు, రాజాపేట అమ్మనబోలు బస్సు పునరుద్ధరించాలి

**లేకుంటే డిపో ముట్టడి చేస్తాం: ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల నరేష్**



**ఆలేరు, జూలై 2:**

ఆలేరు నుంచి రాజాపేట మీదుగా అమ్మనబోలు వరకు నడిచే బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆలేరు పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమై నెల రోజులు గడిచినా ఇప్పటికీ ఆలేరు, రాజాపేట, అమ్మనబోలు గ్రామాలకు బస్సు సర్వీసు పునరుద్ధరించకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సోమారం, బొందుగుల, లక్ష్మక్కపల్లి, రాజానగరం, దూది వెంకటాపురం, కొలనుపాక, మంతపురి, శర్బనపురం, మాటూరు, ఇక్కుర్తి, గొలనుకొండ తదితర గ్రామాల నుంచి ఆలేరు విద్యాసంస్థలకు వచ్చే విద్యార్థులు ఆటోల్లో అధిక చార్జీలు చెల్లిస్తూ ప్రయాణించాల్సి వస్తోందన్నారు. సమయానికి ఆటోలు అందుబాటులో లేక కొందరు రోడ్లపై లిఫ్టుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలతో విద్యార్థులు సమయానికి విద్యాసంస్థలకు చేరుకోలేక చదువుపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. వెంటనే బస్సు సర్వీసును పునరుద్ధరించి విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించాలని అధికారులను కోరారు. లేదంటే విద్యార్థులందరినీ సమీకరించి భారీ స్థాయిలో ఆందోళన చేపట్టి ఆర్టీసీ డిపోను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# నూతన పాల సొసైటీ చైర్మన్లకు భిక్షమయ్య గౌడ్ సన్మానం

**పాడి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని సూచన**



**ఆలేరు, జూలై 2 :**

ఆలేరు శ్రీకృష్ణ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం (పాల సొసైటీ) చైర్మన్‌గా పంతం కృష్ణ, కొల్లూరు పాల సొసైటీ చైర్మన్‌గా అయిలి కృష్ణ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ గురువారం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల సొసైటీల అభివృద్ధితో పాటు పాడి రైతుల సంక్షేమం కోసం చైర్మన్లు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రైతులకు సొసైటీ సేవలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రైతుల ఆదాయాన్ని పెంచే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్లు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పాడి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్, సీనియర్ నాయకుడు కొలుపుల హరినాథ్, మాజీ కౌన్సిలర్ జింకల రామకృష్ణ యాదవ్, యువజన నాయకులు బోడ సతీష్, జింకల భరత్ యాదవ్, జూకంటి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం దరఖాస్తుల గడువు జూలై 15 వరకు పొడిగింపు

**సంగారెడ్డి, జూలై 2:**

ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం (స్ప్రింగ్ సెషన్–2026) కింద దరఖాస్తుల గడువును జూలై 15, 2026 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి డి. వెంకటేశ్వరరావు తెలిపారు.

2026 జనవరి 1 నుంచి జూన్ 30 మధ్య ప్రభుత్వం గుర్తించిన విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన అర్హులైన మైనారిటీ విద్యార్థులు www.telanganaepass.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలి

**సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు.**



**వలిగొండ జూలై 02 :**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం వేసిన గుర్తింపు కమిటీ వెంటనే కాలయాపన చేయకుండా ప్రక్రియ వేగవంతం చేయాలని మలిదశ ఉద్యమకారుడు టి యు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కమిటీ వేసి ఇప్పటికి మూడు నెలలు దాటినదని నేటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ప్రక్రియ మొదలు కాకపోవడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అనేకమంది ప్రాణ త్యాగాలు చేసి జైలు జీవితాలను గడిపి కేసులపాలై ఆర్థికంగా నష్టపోయి రోడ్డున అడ్డా కూలీలుగా బతుకుతున్నారని వారిని ఆదుకోవడానికి వెంటనే గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అంతటి రవి సంగిశెట్టి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# లడఖ్‌లో రెండు శిఖరాలు అధిరోహించిన యశ్వంత్‌కు గోవా సీఎం సన్మానం



**మరిపెడ,జూలై2:**

లడఖ్‌లోని రెండు క్లిష్టమైన పర్వత శిఖరాలను విజయ వంతంగాఅధిరోహించితెలంగాణకుగర్వకారణంగానిలిచి నమహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యా తండాకుచెందినయువపర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ నాయక్‌ను గోవా ముఖ్యమంత్రి డా.ప్రమోద్ సావంత్ తన అధికారిక నివాసంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి యశ్వంత్ నాయక్‌కు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.లడఖ్‌లోని క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు,మంచుతో కప్పబడిన పర్వత శిఖరాలను అధి రోహించిన అనుభవాలను యశ్వంత్ నాయక్ ముఖ్యమంత్రికి వివరించారు.ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని రెండు శిఖరాలను విజయవంతంగా అధిరోహించడం అభినందనీయమని డా.ప్రమోద్ సావంత్ పేర్కొన్నారు.యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ భవిష్యత్తులో మరిన్ని పర్వత శిఖరాలను అధిరోహించి దేశానికి,రాష్ట్రానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానం అందుకోవడం తన జీవితంలో మరపురాని ఘట్టమని భూక్యా యశ్వంత్ నాయక్ ఆనందం వ్యక్తం చేశారు.తన కృషిని గుర్తించి ప్రోత్సహించిన గోవా ముఖ్యమంత్రి డా. ప్రమోద్ సావంత్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో కూడా మరిన్ని సాహసయాత్రలు చేపట్టి దేశానికి మరింత పేరుతీసుకురావడానికి కృషి చేస్తానని యశ్వంత్ నాయక్ పేర్కొన్నారు.

# స్థిరమైన జీవనోపాధులు, సురక్షిత వలసలు సమాజ స్థైర్య నిర్మాణానికి కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**



**నారాయణపేట, జులై,02:**

నారాయణపేట జిల్లాలో స్థిరమైన జీవనోపాధులు, సురక్షిత వలసలు,సమాజ స్థైర్య నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఎఫ్ ఏ వో, ఐ ఓ ఎం, నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్, వాసన్ సంయుక్తంగా అమలు చేస్తున్న మైగ్రేషన్ మల్టీ–పార్ట్నర్ ట్రస్ట్ ఫండ్ సంయుక్త కార్యక్రమ మూడవ జిల్లా స్థాయి కమిటీ (DLC) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, అభివృద్ధి భాగస్వాములు, కార్యక్రమ అమలును సంస్థల ప్రతినిధులు పాల్గొని, కోస్గి, గుండుమల్ మండలాల్లోని వలస కుటుంబాల సామాజిక–ఆర్థిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలు, సురక్షిత వలస సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అనుసంధానంపై కార్యక్రమ పురోగతిని సమీక్షించారు.సమావేశంలో మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్ (MRC), మొబైల్ మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్ (MMRC) ప్రవాసి హెల్ప్‌లైన్ పనితీరును కూడా సమీక్షించారు. వలస కార్మికులు వారి కుటుంబాలకు సమాచారం, మార్గద ర్శకత్వం, కౌన్సెలింగ్, సహాయ సేవలు అందిస్తున్న ఈ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. ముఖ్యంగా కార్మిక కార్డులు, ఇతర సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ సంక్షేమ సేవలకు ఒకే వేదికగా మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలని ఆమె స్పష్టం చేశారు.కార్యక్రమం కింద సాధించిన విజయాలు వలస కుటుంబాలకు చెందిన 40 మంది మహిళలకు సమూహాల వారీగా మేకల పెంపకానికి అవసరమైన షెడ్లు, ప్రతి బృందానికి 30 మేకలు, 2 మగ మేకలను అందజేసి జీవనోపాధి అవకాశాలను కల్పించినట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు.అలాగే కోస్గి, గుండుమల్ మండలాల్లో మహిళల స్వయం సహాయక సంఘాల ద్వారా పేపర్ ప్లేట్ తయారీ యూనిట్లు సహా మొత్తం ఏడు మహిళా ఆధ్వర్యంలోని సూక్ష్మ వ్యాపారాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించడం వలస, బలహీన వర్గాల కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాల కోసం ప్రోత్సహించడం జరిగిందని తెలిపారు.మొబైల్ మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్, ప్రవాసి హెల్ప్‌లైన్ ద్వారా సురక్షిత, క్రమబద్ధమైన చట్టబద్ధమైన వలసలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.సమావేశంలో నారాయణపేటలో నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థ (Skill Training Institute) ఏర్పాటు చేయడం, యువత ఉపాధి అవకాశాలను పెంపొందించడం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించడం, మహిళల జీవనోపాధి అవకాశాలను విస్తరించడం, కిచెన్ గార్డెనింగ్‌ను ప్రోత్సహించడం, కోస్గి చంద్రవంచ, అప్పాయిపల్లిలో ఆర్.ఓ. తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేయడం, అలాగే గ్రామీణ సమగ్రాభివృద్ధి కోసం వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించారు.ఎం ఎం పీ టీ ఎఫ్ సంయుక్త కార్యక్రమం కింద సాధించిన పురోగతిని అభినందించిన జిల్లా కలెక్టర్ , ఎఫ్ ఏ వో, ఐ వో ఎం, ఎన్ డబ్ల్యు డబ్ల్యు టి,వాసన్ భాగస్వాములు, జిల్లా శాఖల సమిష్టి కృషిని ఎంతో ప్రశంసించారు. ఈ కార్యక్రమం మరింత విస్తరించి, ఎక్కువ మంది వలస కుటుంబాలు స్థిరమైన జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, సురక్షిత వలస సేవలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేలా అన్ని శాఖలు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.భవిష్యత్తులో నారాయణపేట స్థానిక ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండ్‌ను అభివృద్ధి చేయడం, భారీ స్థాయిలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించి, జిల్లా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.సమావేశం చివరగా మహిళలు, యువత సాధికారత, స్థిరమైన జీవనోపాధి, సురక్షిత, క్రమబద్ధమైన గౌరవప్రదమైన వలసలను ప్రోత్సహిస్తూ నారాయణపేట జిల్లాలో మరింత స్థైర్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలని సంకల్పించారు. అనంతరం భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్, ఎఫ్ ఏ వో నుంచి జగన్, ఐ వో ఎం రాష్ట్ర సమన్వయకర్త జలజ, సహాయ సమన్వయకర్త మార్ట్ ఆశీర్, కోస్గి, గుండుమల్ ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# SIR సమావేశం లో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మస్కు నర్సింహా

**వలిగొండ జూలై 02 :**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నాతాళ్ళగూడెం గ్రామ పంచాయితీ ఆవరణలో సర్పంచ్ మోటె జంగమ్మ లింగస్వామి అధ్యక్షతన సర్ (SIR) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిగిన సమావేశం లో సర్పంచు మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్కు నర్సింహా పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో బిఎల్ ఓ ప్రతి ఒక్క ఓటరు కు ఎన్యూమరేషన్ ఫారం ఇస్తది కాబట్టి వివిధ బి ఎల్ ఎ లు ప్రతి ఒక్కరుకూడ ఏన్యుమరేషన్ ఫారం లో వివరాలు ఎలా రాయాలో ఓటర్లకు వివరిస్తూ ఒక్క ఓటు కూడ కోల్పోకుండా చూసుకోవాలని అదేవిదంగా బి ఎల్ ఓ కు సహకరించాలని, మరియు రెండు చోట్ల ఓటు ఉన్నట్లయితే ఏదో ఒక చోట మాత్రమే ఓటు ఉండేటట్లు చూసుకోవాలని ఓటర్లకు సూచించాడు. వివిధ పార్టీల నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు మరియు ఓటర్లు కూడ తమ వివరాలతో ఈ సర్ (SIR )కార్యక్రమం సవ్యంగా జరిగేటట్లు విజయవంతం చేయాలనీ కోరారు. ఈ సమావేశంలో పంచాయితీ కార్యదర్శి కోల మచ్చగిరి, వార్డు మెంబెర్ నారి లింగస్వామి బి ఎల్ ఓ మరియు అంగన్వాడీ కార్యకర్త పలుసం రామనర్సమ్మ ఓటర్లు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# పూర్వ సీపీ సన్ ప్రీత్ సింగ్ కు వరంగల్ పోలీసుల ఘన వీడ్కోలు



**వరంగల్ జూలై2:**

వరంగల్ పోలీస్ కమిషనర్ గా విధులు నిర్వహించి ఇటీవల సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గా బదిలీ అయిన సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ కు గురువారం వరంగల్ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ మైదానంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై సన్ ప్రీత్ సింగ్ ను నిలబెట్టి, పోలీస్ అధికారులు తాళ్లతో వాహనాన్ని లాగుతూ గౌరవప్రదంగా వీడ్కోలు పలికారు. అనంతరం అధికారులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో 15 నెలలపాటు విధులు నిర్వహించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని, ప్రతి అధికారి, ప్రతి పోలీస్ సిబ్బంది అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. అందరి సమన్వయంతో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించడంలో మంచి ఫలితాలు సాధించగలిగామని తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ తో తనకు ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని, ఇక్కడి అధికారులు, సిబ్బంది, ప్రజలు చూపిన ప్రేమాభిమానాలు జీవితాంతం గుర్తుండిపోతాయని పేర్కొంటూ, కమిషనరేట్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు ధార కవిత, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావు, బాలస్వామి, ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, ఆర్ .ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ కమిషనర్‌ను కలిసిన జిల్లా కలెక్టర్

**వరంగల్, జూలై 2:.**

వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై ఇరువురు అధికారులు చర్చించారు. అలాగే పోలీసు, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. రానున్న పండుగలు, ప్రత్యేక ప్రభుత్వ కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతల అంశాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో సుస్థిర పరిపాలన అందించేందుకు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వారు పేర్కొన్నారు.

# లైంగిక దాడుల బాధితులకు సకాలంలో న్యాయం అందించేందుకు శాఖల సమన్వయం అవసరం

సీపీ ఎన్. శ్వేత

**హనుమకొండ, జూలై 2:.**

లైంగిక దాడుల బాధితులకు చట్టబద్ధమైన రక్షణ, వైద్య, న్యాయ, మానసిక పరామర్శ, పునరావాస సేవలు సకాలంలో అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో గురువారం నిర్వహించిన భరోసా కేంద్రం సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బాధితుల గౌరవం, గోప్యతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి కేసును




సున్నితంగా విచారించాలని తెలిపారు. కేసు నమోదు నుంచి దర్యాప్తు, వైద్య పరీక్షలు, ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పునరావాసం వరకు ప్రతి దశలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పోక్సో కేసుల్లో నిర్దేశిత గడువులో దర్యాప్తు పూర్తి చేసి, బలమైన సాక్ష్యాధారాలతో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భరోసా కేంద్రం ద్వారా బాధితులకు అన్ని సేవలు ఒకే వేదికపై సమర్థవంతంగా అందేలా చూడాలని తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ.

**మొమిన్ పేట మండలం, జులై,02:**

మోమిన్ పెట్ మండలం 75 వార్డులో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఇంటింటి సర్వే తీరును క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ గురువారం పరిశీలించారు. ఎన్ని ఫారాలు ఇచ్చారు, కుటుంబంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, కుటుంబ సభ్యులు ఒకే పి ఎస్ లో ఉన్నారా, కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్ఓ ప్రతి ఇంటికి తిరిగి అందించాలని కలెక్టర్ తెలిపారు.18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.ఉర్దూ మాట్లాడే ప్రజలు ఉన్న చోట ఉర్దూ ఫారాలు వారికీ అందజేయాలని ,ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించాలని ఆయన బిఎల్ఓ లకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత బిఎల్ఓ లదేనని కలెక్టర్ తెలిపారు.ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ వివరాలను సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు గర్ల్స్ , బాయ్స్, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సంబంధించిన వంటకాలను పరిశీలించారు. కిచెన్ షెడ్, ఆహార పదార్థాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని అధికారులకు సూచించారు.పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా తరగతిలో బోధన విధానాన్ని, హాజరు శాతాన్ని పరిశీలించారు. మోమిన్ పేట్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సంద



ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యాధికారులు చిత్తశుద్ధితో పనిచేయలన్నారు.ఆసుపత్రిలో కావలసిన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో సౌకర్యాలపై ఆసుపత్రికి వచ్చిన రోగులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, ఇన్ పేషెంట్ వార్డు, వార్డు గదులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మున్నిరుద్దిన్, సివిల్ సర్జన్ బుచ్చి బాబు ,ఎం పి డి ఓ రాజ మల్లయ్య, సర్పంచు సర్పంచ్ సంధ్య, సుభాష్ గౌడ్, డిప్యూటీ తాహసిల్దార్ గోవర్ధన్ గౌడ్, సురేష్, బి ఎల్ ఓ లు, పాఠశాల ప్రదానోపద్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆలయ వేలంపాటలో గందరగోళం

- **ఏసీబీ కేసు నిందితుడిని పక్కన కూర్చోబెట్టి వేలంపాట నిర్వహణపై వివాదం**
- **ఈఓను నిలదీసిన స్థానికులు**

**మరిపెడ,జూలై2:**

మరిపెడ మండలంలోని సుప్రసిద్ధ మాకుల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వార్షిక వేలంపాట వివాదాస్పదంగా మారింది. గతంలో గుంజేడు ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో రూ.20 వేల లంచం తీసుకుంటూ అవినీతి



నిరోధక శాఖ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గాచిక్కిన కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఈవో బిక్షమాచారిని వేలంపాట సందర్భంగా అధికారుల పక్కన కూర్చోబెట్టడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కుడితి వెంకటరెడ్డి,వేర్మరెడ్డి వెంక ట రెడ్డి, రాజు, ర మేష్ మాట్లాడుతూ..ఏసీబీ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి ఆలయ కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని దేవాదాయ శాఖ అధికారులను ప్రశ్నించారు.

అలాగే,బిక్షమాచారి మరిపెడ మాకుల శ్రీ వెంకటేశ్వర ఆలయంలో పనిచేసిన సమయంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టారని,రైతుబంధు పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారంటూ ఆరోపించారు.ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, దీనిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం పరిశీలన

జిల్లా ఆర్డీఓ మరియు పరిగి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి-వాసుచంద్ర

**పూడూర్ మండలం, జులై,02:**

ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ ఆర్డీఓ మరియు పరిగి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, వాసుచంద్ర పూడూరు మండల పరిధిలో చిలాపూర్, పెద్ద ఉమ్మెంతాల్ మరియు కంకల్ గ్రామాల్లో పర్యటించారు సంబంధిత బిఎల్ఓ లతో మాట్లాడి SIR ప్రక్రియలో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ గురించి ఆరా తీశారు, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ఎట్టి పరిస్థితుల్లో రేపటికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు అదేవిధంగా ప్రజలు నింపిన ఎన్యూమరేషన్ ఫారాల ను విధిగా కలెక్ట్ చేయాలని నిర్దేశించారు ప్రజలందరూ SIR కార్యక్రమంలో విస్తృతంగా పాలుపంచుకోవాలని దీనికై అన్ని పార్టీలు సంబంధిత BLO లు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో పూడూర్ తాహసిల్దార్ విజయ్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

# డాక్టర్ RS ప్రవీణ్ కుమార్ కి భద్రత పునరుద్ధరించాలి

**కొడంగల్ మున్సిపల్, జులై,02:**



వికారాబాద్ జిల్లా, కొడంగల్ మండల కేంద్రంలో స్వేరోస్ మరియు వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్, స్వేరోస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ బోడ వెంకటేష్,బీసీ సేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దేశం కోసం 26 సంవత్సరాలు ప్రాణాన్ని ప్రాణంగా పెట్టి దేశ రక్షణకై దేశం యొక్క సమగ్రతపై పాటుపడుతూ పనిచేసినటువంటి వ్యక్తికి లక్షల మందికిపైగా జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నతమైన వ్యక్తికి ఈరోజు ఆయనకు ఆనాటి ప్రభుత్వం ఇచ్చినటువంటి భద్రతను తగ్గించడం సరికాదు కాబట్టి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి ఏదైతే గత ప్రభుత్వం ఇచ్చినటువంటి సెక్రటరీని బుల్లెట్ ప్రూఫ్ కార్ మరియు 2 ప్లస్ 2 ఎక్స్ కేటగిరీని పునరుద్ధరించాలని స్వేరోస్ తరఫు నుండి ప్రజాసంఘాల తరపున ఖండిస్తున్నాం.లేని పక్షంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి 33 జిల్లాల తరపునుండి స్వేరోస్ మరియు ప్రజా సంఘాల సమక్షంలో ఉద్యమాన్ని చేపడతాం.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమైన నాయకులు అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి గౌరీగల కృష్ణ తదితరులు ఉన్నారు.

# ఘన వ్యర్థాల నిర్వహణ మరింత సమర్థవంతంగా చేపట్టాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న

**వరంగల్, జూలై 2:.**

గ్రేటర్ వరంగల్ నగరంలో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. ఘన వ్యర్థాల నిర్వహణపై గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన బయోమైనింగ్, బయోమిథనైజేషన్ ప్లాంట్ల పనితీరు, పారిశుద్ధ్య వాహనాల రిజిస్ట్రేషన్, రూట్ మ్యాపింగ్, ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్వహణపై సమీక్షించారు. నగరంలో చెత్త సేకరణ జరగని ప్రాంతాలను గుర్తించి వెంటనే సేవలు అందించాలని సూచించారు. 150 కేఎల్‌డీ సామర్థ్యంతో ఉన్న ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలని, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్ టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సిటీ ప్లానర్‌ను ఆదేశించారు.

# బంధిత కార్మికుల వేధింపులపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటో విచారణ

**న్యూఢిల్లీ, జూలై 2:**

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫ్ఫర్‌నగర్‌లో 12 మంది బంధిత కార్మికులను నిర్బంధించి వేధించిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా విచారణ చేపట్టింది. రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. జిల్లా కలెక్టర్‌తో విచారణ నిర్వహించాలని, బాధితులను వెంటనే ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. ఉద్యోగాల పేరుతో వివిధ రాష్ట్రాలు, నేపాల్‌కు చెందిన కార్మికులను తీసుకెళ్లి బలవంతంగా పని చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక కార్మికుడు తప్పించుకుని సమాచారం ఇవ్వడంతో మిగిలిన వారిని పోలీసులు రక్షించారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యంగా వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం

**మరిపెడ,జూలై2:**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదికలో గురువారం గ్రామపంచాయతీ వార్డు సభ్యుల నాల్గవ రోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.గ్రామపంచాయతీ పాలనలో వార్డు సభ్యుల పాత్ర, గ్రామాభివృద్ధి ప్రణాళికలు,పారిశుధ్యం, ప్రజా సమస్యల పరిష్కారం,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, స్థానిక సంస్థల బాధ్యతలు వంటి అంశాలపై ట్రైనర్లు వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ట్రైనర్లు రామోజీ,సుమన్,వెంకన్న,పంచాయతీ కార్యదర్శులు మంజుల,రాజు,అరుణ్, తాహేర్,ఆపరేటర్ ఉమతో పాటు ఆయా గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించాలని ట్రైనర్లు సూచించారు.

# పెద్దేముల్ పోలీస్ స్టేషన్లో సందర్శించిన డీఎస్పీ నర్సింగ్ యాదయ్య



**పెద్దేముల్ మండలం, జులై,02:**

వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసు దస్త్రాలు, మాల్ఖానా, స్టేషన్ నిర్వహణ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే సిబ్బంది సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించి, వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మండల పరిధిలో జరిగే ఆస్తి సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, నేరాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.అదేవిధంగా మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో తాండూర్ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, పెద్దేముల్ ఎస్సై ఎం. ప్రశాంత్ వర్ధన్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నెంబర్ ప్లేట్ లేని 20 వాహనాలు సీజ్

ప్రత్యేక తనిఖీలను కొనసాగిస్తాం:



**హనుమకొండజూలై2:**

ట్రాఫిక్ పోలీసులుహనుమకొండ, జూలై 2: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఏసీపీ టి. సత్యనారాయణ ఆధ్వర్యంలో హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు గురువారం నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నెంబర్ ప్లేట్ లేకుండా సంచరిస్తున్న 20 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల కోసం గౌరవ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. నగరంలో నెంబర్ ప్లేట్ లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వాహనదారులందరూ తమ వాహనాలకు నిబంధనలకు అనుగుణమైన నెంబర్ ప్లేట్లను తప్పనిసరిగా అమర్చుకొని, ట్రాఫిక్ నిబంధనలను పాటించి పోలీసు శాఖకు సహకరించాలని హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# జూన్‌లో రైల్వే సరుకు రవాణా 4 శాతం వృద్ధి

- తొలి త్రైమాసికంలో 419 మిలియన్ టన్నుల సరుకు రవాణా
- జూన్‌లో 63.81 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు

**న్యూఢిల్లీ, జూలై 2:.**

దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన భారతీయ రైల్వేలు 2026 జూన్ నెలలో సరుకు, ప్రయాణికుల రవాణాలో మరోసారి వృద్ధిని నమోదు చేశాయి. గత ఏడాది జూన్‌తో పోల్చితే సరుకు రవాణా 4 శాతం పెరిగి 142.21 మిలియన్ టన్నులకు చేరుకుంది.

ఎరువుల రవాణా 19.1 శాతం, ఇతర వస్తువుల రవాణా 17.3 శాతం, ఇనుప ఖనిజం రవాణా 9.4 శాతం పెరగగా, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గు సరఫరా 7 శాతం అధికమైంది. 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారతీయ రైల్వేలు మొత్తం 419.08 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసి, గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే మెరుగైన పనితీరు కనబరిచాయి. ప్రయాణికుల రవాణాలోనూ రైల్వేలు స్థిరమైన వృద్ధిని నమోదు చేశాయి. జూన్ నెలలో 63.81 కోట్ల మంది రైల్వే సేవలను వినియోగించారు. వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా 164 వందే భారత్, 72 అమృత్ భారత్ రైళ్లు సేవలందిస్తూ సురక్షితమైన, విశ్వసనీయమైన, అందుబాటు ధరల్లో ప్రయాణ సౌకర్యాలను కల్పిస్తున్నాయని రైల్వే శాఖ తెలిపింది.అవసరమైతే ఇదే వార్తను మరింత సంక్షిప్తంగా లేదా ఉపశీర్షికలతో జిల్లా పత్రిక శైలిలో కూడా సిద్ధం చేయగలను.

# వడ్డేపల్లి బండ్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

## జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



**వరంగల్, జూలై 2:.**

గ్రేటర్ వరంగల్ నగరంలోని వడ్డేపల్లి బండ్ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం వడ్డేపల్లి బండ్ వద్ద కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్, పనుల పురోగతి, నిర్మాణ నాణ్యతపై ఆరా తీశారు. ప్రతి పనిని ప్రణాళికాబద్ధంగా చేపట్టి, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని సూచించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేలా పనులను వేగవంతం చేయాలని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా నిరంతర పర్యవేక్షణతో గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పీఎంజీకేఏవై లబ్ధిదారులకు మెరుగైన నాణ్యత బియ్యం

## 80 కోట్ల మందికి ప్రయోజనం.. ఏటా రూ.2,161 కోట్ల ఆదా

**న్యూఢిల్లీ, జూలై 2 :**

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై), ఇతర సంక్షేమ పథకాల కింద పంపిణీ చేసే బియ్యం నాణ్యతను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థలో బియ్యం నాణ్యత ప్రమాణాలను సవరించింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా 80 కోట్లకుపైగా లబ్ధిదారులకు మెరుగైన నాణ్యత గల బియ్యం అందనుంది. మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ) ఆమోదించిన కొత్త నిబంధనల ప్రకారం ముడి బియ్యంలో విరిగిన గింజల శాతాన్ని ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 10 శాతానికి, ఉప్పుడు బియ్యంలో 16 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. కొత్త నాణ్యత ప్రమాణాలతో బియ్యం సేకరణను తక్షణమే ప్రారంభించి, 2027–28 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ నుంచి దేశవ్యాప్తంగా దశలవారీగా పంపిణీ చేయనున్నారు. ఈ నిర్ణయంతో లబ్ధిదారులకు మరింత మెరుగైన నాణ్యత, మంచి రూపంతో కూడిన బియ్యం అందుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మిల్లింగ్ సమయంలో వేరు చేసే విరిగిన బియ్యాన్ని పారిశ్రామిక అవసరాలకు వినియోగించనున్నారు. కొత్త విధానంతో రవాణా, నిల్వ, ప్యాకేజింగ్ వ్యయాలు తగ్గి ఏటా సుమారు రూ.2,161 కోట్ల మేర ఆదా అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అలాగే బియ్యం బస్తాలపై క్యూ ఆర్ కోడ్‌లను అమర్చడం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెరగడంతో పాటు సరఫరా ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించే అవకాశం కలుగనుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, హర్యానా, పంజాబ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో చేపట్టిన పైలట్ అమలు విజయవంతం కావడంతో ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# జపాన్‌తో భారత్‌కు భారీ గ్రీన్ ఇంధన ఒప్పందాలు

## గ్రీన్ అమోనియా, గ్రీన్ మెథనాల్ సరఫరాకు ఏసీఎంఈ ఒప్పందాలు

**న్యూఢిల్లీ, జూలై 2:.**

జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద భారత్ మరో కీలక ముందడుగు వేసింది. దేశీయ ఏసీఎంఈ గ్రూప్ జపాన్‌కు చెందిన ఐహెచ్‌ఐ కార్పొరేషన్‌తో గ్రీన్ అమోనియా, మిత్సుబిషి గ్యాస్ కెమికల్ కంపెనీతో గ్రీన్ మెథనాల్ సరఫరాకు దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకుంది. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా సైట్ పథకం కింద ఏసీఎంఈకు ఏటా 3.70 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యం కేటాయించారు. ఈ నేపథ్యంలో ఐహెచ్‌ఐ సంస్థకు ఏటా 4.05 లక్షల టన్నుల గ్రీన్ అమోనియా, మిత్సుబిషి గ్యాస్ కెమికల్ కంపెనీకి 10 సంవత్సరాల పాటు ఏటా లక్ష టన్నుల గ్రీన్ మెథనాల్ సరఫరా చేయనుంది. ఈ ఒప్పందాలు భారత్‌ను గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, ఎగుమతుల రంగంలో ప్రపంచ స్థాయి కేంద్రంగా నిలబెట్టడంలో కీలకంగా మారనున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. జపాన్‌తో స్వచ్ఛ ఇంధన భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు భారత గ్రీన్ హైడ్రోజన్ రంగంలో అంతర్జాతీయ పెట్టుబడులు, ఎగుమతి అవకాశాలకు ఇవి ఊతమివ్వనున్నాయని పేర్కొంది.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం

- ఎన్యుమరేషన్ ఫారాల భర్తీలో సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలి: అదనపు కలెక్టర్ వెంకారెడ్డి
- ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకారెడ్డి



**ఆలేరు, జూలై 2 :**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆలేరు అసెంబ్లీ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ), అదనపు కలెక్టర్ వెంకారెడ్డి సమావేశమయ్యారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, భర్తీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి మాట్లాడుతూ, మండలంలో ఎస్ఐఆర్ కార్యక్రమం సజావుగా కొనసాగుతోందని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను నింపే సమయంలో ఎలాంటి సందేహాలు లేదా ఇబ్బందులు ఎదురైనా సంబంధిత బీఎల్ఓలు లేదా ఏఈఆర్ఓను సంప్రదించాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులకు మరోసారి ఫారాల భర్తీ విధానంపై అవగాహన కల్పించి, వారు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.ఈ సమావేశంలో తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, ఎన్నికల శిక్షకులు దూడల వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ రాందాస్ నాయక్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికా విద్యకు గ్రామీణ భాగస్వామ్య సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం

**జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**



**నారాయణపేట, జులై,02:**

బాలికా విద్యను ప్రోత్సహిస్తున్న గ్రామీణ భాగస్వామ్య సంస్థ ( వీ ఐ పీ) చేస్తున్న కృషి అభినందనీయం అని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. ఆడపిల్లల ఉన్నత చదువుల కోసం గత 7 సంవత్సరాలుగా ఆర్థిక సాయం అందించడంతో పాటు ప్యాకేజీ రూపంలో చేయూత ఇవ్వడం ఎంతో గొప్ప విషయం అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో గురువారం పాలమూరు కు చెందిన గ్రామీణ భాగస్వామ్య సంస్థ ఆధ్వర్యంలో బాలికా విద్యను ప్రోత్సహించాలనే సంకల్పంతో జిల్లాలోని తెలుగు మాధ్యమ ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతి ఫలితాలలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన బాలికలకు ప్రోత్సాహక బహుమతులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో బాల్య వివాహాలను నిర్మూలించి, బాలికా విద్యను ముందుకు సాగించడానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం మాత్రమే పని చేస్తే సరిపోదని, బాలికా విద్య కు అందరూ తమ వంతుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాలమూరు జిల్లాలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతుండగా అందులో ముఖ్యంగా నారాయణపేట జిల్లాలో వాటి సంఖ్య ఎక్కువగా ఉందని ఇటీవలే సర్వే లో వెల్లడైందని, బాల్య వివాహాల నిర్మూలనకు బాలికా విద్యనే ముఖ్యం అని ఆమె పేర్కొన్నారు. ఆడపిల్లలు ఉన్నత చదువులు చదివి ఆర్థిక స్వాతంత్రం సాధించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారిలో బాలికలదే పై చేయి కావడం సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల నిరంతర కృషి వల్లే ఇది సాధ్యం అయిందని ఆమె చెప్పారు. ఆడపిల్లలు తలచుకుంటే సాధించనిది అంటూ ఏదీ లేదని, లక్ష్య సాధనకు నిరంతర కృషి చేస్తూ ఇష్టపడి చదవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. నారాయణ పేట జిల్లా లో బాలికా విద్యను ప్రోత్సహించేందుకు గ్రామీణ భాగస్వామ్య సంస్థ చేస్తున్న ఈ గొప్ప కార్యానికి జిల్లా తరపున తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన అన్ని మండలాల ప్రభుత్వ పాఠశాలల బాలికలకు కలెక్టర్ చేతుల మీదుగా రూ. 5 వేల నగదుతో పాటు వచ్చే ఐదేళ్ల ఉన్నత చదువు కోసం 20 వేల బ్యాంకు డిపాజిట్ ధ్రువ పత్రం అందజేశారు. తల్లితండ్రులకు నూతన వస్త్రాలు, సర్పంచులు, పాఠశాలల హెచ్ ఎం లకు నేరేడు మొక్కలను ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ భాగస్వామ్య సంస్థ అధ్యక్షుడు, మాజీ ఐ ఏ ఎస్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి నాగేందర్ స్వామి, జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, ఎస్. బీ. ఐ. హెడ్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# మాకుల టెండర్ దక్కించుకున్న రవికాంత్

**మరిపెడ,జూలై2:**

సుప్రసిద్ధ మాకుల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వార్షిక టెండర్ వేలం విజయవంతంగా ముగిసింది. కిరాణం,కూల్ డ్రింక్స్,టెంట్ హౌస్ వేలం పాటలో గ్రామానికి చెందిన భాష పొంగు రవికాంత్ రూ.2.70లక్షలటెండర్‌నుదక్కించుకున్నారు.దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధనల మేరకు ఆలయ ప్రాంగణంలో టెండర్ ప్రక్రియనునిర్వహించారు.పలువురు టెండర్ దారులుపోటీపడగా,చివరకు అత్యధిక వేలం పాట పాడిన రవికాంత్‌కు టెండర్ ఖరారైంది.ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణఅధికారి ఈవో వెంకట్రావుమాట్లాడుతూ..టెండర్ పొందినరవికాంత్ఏడాది పాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధనలకుఅనుగుణంగావ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు.ఆలయ ఆదాయానికి ఎలాంటి నష్టంకలగకుండా,ఆలయ ప్రతిష్ఠను కాపాడుతూ భక్తులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.ఈకార్యక్రమంలో కుడితి వెంకటరెడ్డి వేర్మరెడ్డి వెంకటరెడ్డి బుడుగుల రాజు,రేఖ రమేష్,ఆలయ సిబ్బంది శేఖర్‌తో పాటు ఇతర సిబ్బంది,టెండర్ దారులు,గ్రామ పెద్దలు,భక్తులు పాల్గొన్నారు.



# పెద్ద కొడప్గల్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, జూలై 2:**

పెద్ద కొడప్గల్ మండలంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద పూర్తయిన ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆప్యాయంగా ముచ్చటించి, కొత్త ఇంటిలో సుఖసంతోషాలతో జీవించాలని శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ఇందిరమ్మ గృహాల లక్ష్యమని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణ నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ సహాయం అందుతున్న తీరుపై ఆరా తీశారు. మిగిలిన గృహాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారుకు త్వరగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వర్డు నంబర్ 11లో పబ్లిక్ టాయిలెట్ నిర్మాణం

**కొడంగల్ మున్సిపల్,జులై,02:**

కొడంగల్ మున్సిపాలిటీ 11వ వార్డులో మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా టాయిలెట్ నిర్మాణంకోసం గురువారం ముగ్గు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, కౌన్సిలర్లు కుశ గారి రాజశేఖర్,బత్తుల అనిత నర్సింహులు, ఎంఐఎం కౌన్సిలర్ రుమాన్,కో అప్షన్ సభ్యులు జి. రమేష్ బాబు షరీఫ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదిరెడ్డి, మరియు మున్సిపల్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు

# యూరియా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: కలెక్టర్ కె. హైమావతి

**సిద్ది పేట జూలై2:.**

జిల్లాలో యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి హెచ్చరించారు. చేర్యాలలోని శ్రీ సాయి శివ ఫర్టిలైజర్స్ దుకాణంలో యూరియా దుర్వినియోగం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈ–పాస్ వ్యవస్థను దుర్వినియోగం చేసి రైతుల పేర్లతో అక్రమ విక్రయాలు చేసినందుకు దుకాణ యజమానిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో పాటు లైసెన్సును రద్దు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో యూరియా సరఫరా చేసిన శ్రీ ఆంజనేయ ఫర్టిలైజర్స్, శ్రీ గణేష్ ట్రేడర్స్ లైసెన్సులను కూడా రద్దు చేసినట్లు వెల్లడించారు. పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన చేర్యాల మండల వ్యవసాయ అధికారిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఇతరుల ప్రమేయంపై విచారణ కొనసాగుతోందని, బాధ్యులెవ్వరినీ విడిచిపెట్టబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. యూరియా అక్రమ నిల్వ, డైవర్షన్, దుర్వినియోగానికి పాల్పడితే ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల నమోదు అధికారి కృష్ణవేణి

**ములుగు జూలై2:.**

ములుగు జిల్లా గోవిందరావుపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2026 కార్యక్రమాన్ని ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి బీఎల్‌ఓలతో మాట్లాడిన ఆమె, ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించి ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఇంటింటి గణనలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ, ఎలాంటి తప్పులు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రోజుకు రెండు చాలు..



డ్రై ఫ్రూట్స్‌లో కూడా ఒకటి. ఖర్జూరంలో ఉండే పోషకాలు అన్నీ ఇన్నీ కావు. మనిషి శరీరానికి కావాల్సినన్ని విటమిన్లు, మినరల్స్ ఖర్జూరంలో లభిస్తాయి. ప్రతి రోజు రెండు ఖర్జూరాలు తింటే ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. అంతే కాకుండా అనారోగ్య సమస్యలు కూడా దరి చేరవు. ముఖ్యంగా బాడీలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఖర్జూరాల్లో రెండు రకాలు ఉంటాయి. ఒకటి పచ్చివి. రెండోది ఎండిన ఖర్జూరాలు. ఎండిన ఖర్జూరాలను రాత్రంతా నానబెట్టి ఉదయం తింటే ఇంకా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఖర్జూరాలతో కేవలం ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా చర్మం, జుట్టు సమస్యల్ని కూడా తగ్గించుకోవచ్చు. అయితే ఇవి కేవలం సీజనల్ వారీగానే లభ్యమవుతాయి. కానీ వీటిని ప్రిజర్వేట్ చేసి అన్ని కాలాల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ముఖ్యంగా చలికాలంలో వీటిని తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఖర్జూరంలో విటమిన్లు, పొటాషియం, కాల్షియం, ఖనిజాలు, ఫైబర్, ఫాస్పరస్, కాపర్, మెగ్నీషియం పుష్కలంగా లభిస్తాయి.

## గుండె ఆరోగ్యానికి భరోసా..

గుండె ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది. వీటిలో ఉండే మెగ్నీషియం, పొటాషియం.. రక్తపోటును తగ్గించి, గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. అందాన్ని రెట్టింపు చేయడంలోనూ ఖర్జూరాలు ముందుంటాయి. వీటిని రోజుకు రెండు చొప్పున తింటే.. చర్మం కాంతిమంతంగా తయారవుతుంది. ఖర్జూరలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్లు.. చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి.రక్తహీనతకు ఖర్జూరాలు విరుగుడులా పనిచేస్తాయి. ఇవి శరీరంలో ఇనుమును పెంచి.. రక్తహీనతను దూరం చేస్తాయి.ఖర్జూరలో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి, ఇతర యాంటి ఆక్సిడెంట్లు.. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి.మలబద్ధకం సమస్యను నివారించడంలో ఖర్జూరం సమర్థంగా పనిచేస్తుంది. దీనిలో ఉండే ఫైబర్.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.ఖర్జూరలో ఉండే మెగ్నీషియం, కాల్షియం, పాస్ఫరస్.. ఎముకల దృఢత్వాన్ని పెంచుతాయి.

**రక్త హీనత కంట్రోల్:** రోజూ రెండు ఖర్జూరాలను తినడం వల్ల రక్త హీనత సమస్య అదుపులోకి వస్తుంది. ఖర్జూరాల్లో ఐరన్ కంటెంట్, విటమిన్ సి మెండుగా లభ్యమవుతాయి కాబట్టి.. వీటిని తింటే రక్త హీనత లోపం నుంచి బయట పడొచ్చు. నానబెట్టిన ఖర్జూరాలైనా తినొచ్చు. ఖర్జూరాల్లో మెగ్నీషియం, పొటాషియం వంటివి పుష్కలంగా లభిస్తాయి. ఇవి రక్త పోటును నియంత్రించడానికి బాగా సహాయ పడుతుంది. అంతే కాకుండా కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి, గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగు పరుస్తుంది.

**బ్రెయిన్ హెల్దీ:** ఖర్జూరాల్లో మెగ్నీషియం, విటమిన్ బి6 పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడులోని ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. అదే విధంగా తెలివి తేటలను కూడా పెంచుతాయి. ఖర్జూరాలు తింటే బ్రెయిన్ యాక్టీవ్‌గా ఉంటుంది. పిల్లలకు ఇవ్వడం చాలా మంచిది. ఖర్జూరాల్లో ఫాస్పరస్, క్యాల్షియం, మెగ్నీషియం లభిస్తాయి కనుక.. వీటిని తింటే ఎముకలు బలంగా, దృఢంగా ఉంటాయి. అంతే కాకుండా ఎముకలకు వచ్చే సమస్యలు కూడా తగ్గుతాయి.

**చర్మం, జుట్టు ఆరోగ్యం:** ప్రతి రోజూ ఖర్జూరాలను తినడం వల్ల చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు జుట్టు రాలకుండా, చర్మం అందంగా మెరిసేలా చేస్తుంది

# నాలుకపై మచ్చలు అదృష్టం కాదు

నాలుకపై నల్లటి మచ్చలు కనిపిస్తే అదృష్టమని, వారు ఏదైనా చెబితే చాలా వరకు నిజం అవుతుందని కొందరు నమ్ముతుంటారు. కానీ ఇది కేవలం మూఢ నమ్మకం మాత్రమే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. నాలుకపై నల్లటి, తెల్లటి, ఎర్రటి రంగుల్లో ఏర్పడే మచ్చలు వాస్తవానికి శరీరంలో ప్రారంభమయ్యే కొన్ని రకాల వ్యాధుల లక్షణాలు కూడా కావచ్చునని చెబుతున్నారు. ముఖ్యంగా ల్యూకోప్లాకియా లేదా ఓరల్ థ్రష్, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రారంభం లక్షణాల్లో నాలుకపై మచ్చలు ఏర్పడే అవకాశం ఉందని అంటున్నారు. కాఫీ లేదా రెడ్ వైన్ వంటి కొన్ని ఆహారాలు లేదా పానీయాలు తీసుకోవడం వంటి హానిచేయని కారణాల వల్ల అవి సంభవించవచ్చు, అయితే నల్ల మచ్చలు కొన్నిసార్లు అంతర్లీన ఆరోగ్య సమస్యలను సూచిస్తాయి.



## ల్యుకోప్లాకియా వ్యాధి

కేవలం మచ్చలే కాకుండా నాలుక ఆధారంగా పలు రోగాలను గుర్తింవచ్చునని వైద్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా నల్లటి, తెల్లటి మచ్చలు మచ్చలు కనిపించడం, క్రీమ్ వంటి తెల్లటి పదార్థం నాలుకపై ఉత్పత్తి అవుతుండటం అనుమానించ దగినవివే. ఎందుకంటే ఇవి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్నప్పడు సంభవించే లక్షణాలని పేర్కొంటున్నారు. అట్లనే కొన్నిసార్లు ఫంగల్ ఇన్ఫెక్షన్స్ వల్ల కూడా నాలుకపై తెల్లటి మచ్చలు ఏర్పడవచ్చు. నల్లటి మచ్చలు ఏర్పడి క్రీమ్ వంటి పదార్థం ఎక్కువగా కనిపిస్తే అది ల్యుకోప్లాకియా వ్యాధికి దారితీస్తుందని, క్రమంగా క్యాన్సర్‌గా మారే అవకాశం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాబట్టి నాలుకపై అనుమానాస్పద మచ్చలు కనిపిస్తే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించడం ఉత్తమం. మానవ నాలుక అనేది పాపిల్లై అని పిలువబడే చిన్న గడ్డలతో కప్పబడిన ఒక ఆకర్షణీయమైన కండరం, ఇది మన రుచి మొగ్గలను కలిగి ఉంటుంది. ఈ ఇంద్రియ అవయవాలు మనకు వివిధ రకాల రుచులను ఆస్వాదించడానికి అనుమతిస్తాయి. అప్పడప్పడు, ఈ పాపిల్లై చనిపోయిన చర్మ కణాలు, శిథిలాలు లేదా ఆహార రంగులను బంధించి, నల్ల మచ్చల రూపాన్ని సృష్టిస్తాయి. నిరపాయకరమైన తాత్కాలిక భాషా పాపిలిటిస్ లేదా "వెంట్రుకల నాలుక" అని పిలువబడే ఈ పరిస్థితి సాధారణంగా హానిచేయనిది. మీ నాలుకను సున్నితంగా బ్రష్ చేయడంతో సహా మంచి నోటి పరిశుభ్రత సాధారణంగా దానిని క్లియర్ చేస్తుంది.

### ఫోలిక్ యాసిడ్ లోపం

ఫోలిక్ ఆమ్లం లేదా విటమిన్ బీ9, కణాల పెరుగుదల మరియు డీఎన్‌ఏ సంశ్లేషణకు ముఖ్యమైనది. ఫోలిక్ ఆమ్లం లోపం వల్ల నోటిలో గ్లోసిటిస్ మరియు నాలుక రంగులో మార్పులు వంటివి వస్తాయి. నాలుక ఉపరితలంపై ఉండే ఎపిథీలియల్ కణాలలో మార్పుల వల్ల నల్ల మచ్చలు ఏర్పడవచ్చు.

### ఆహార మార్పులు

విటమిన్ బి12, ఐరన్ మరియు ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా మీ ఆహారాన్ని మెరుగుపరచుకోవడం వల్ల లోపాలను పరిష్కరించడంలో మరియు నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. లీన్ మీట్స్, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, చిక్కుళ్ళు మరియు బలవర్ధకమైన తృణధాన్యాలు వంటి వనరులను మీ ఆహారంలో చేర్చుకోండి.

### సప్లిమెంట్స్

తీవ్రమైన లోపాల సందర్భాలలో లేదా ఆహారంలో మార్పులు సరిపోకపోతే సప్లిమెంట్లను సిఫార్సు చేయవచ్చు. మీ అవసరాలకు తగిన మోతాదు మరియు సప్లిమెంట్ల రకాన్ని నిర్ణయించడానికి ఆరోగ్య సంరక్షణ నిపుణుడిని లేదా నమోదిత డైటీషియన్‌ను సంప్రదించండి.

### పర్యవేక్షణ అవసరం

మీ నాలుకలో నల్ల మచ్చలు లేదా ఏవైనా మార్పులు కనిపిస్తే, క్షుణ్ణంగా మూల్యాంకనం కోసం దంతవైద్యుడు లేదా ఆరోగ్య సంరక్షణ ప్రదాతను సంప్రదించండి. వారు మీ నోటి ఆరోగ్యాన్ని అంచనా వేయగలరు, ఏవైనా అంతర్లీన లోపాలు లేదా పరిస్థితులను గుర్తించగలరు మరియు తగిన చికిత్సను సిఫార్సు చేయగలరు.

### నోటి పరిశుభ్రత పద్ధతులు

నాలుక ఆరోగ్యంతో సహా మొత్తం నోటి ఆరోగ్యానికి మంచి నోటి పరిశుభ్రతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. రోజుకు రెండుసార్లు మీ దంతాలను బ్రష్ చేయండి, నాలుకను స్క్రాపర్ లేదా టూత్ బ్రష్‌తో శుభ్రం చేయండి మరియు నాలుక రంగు మారడానికి దోహదపడే ఫలకం మరియు బ్యాక్టీరియాను తొలగించడానికి క్రమం తప్పకుండా ఫ్లాస్ చేయండి.

### వైద్య చికిత్స

కొన్నిసార్లు, నాలుకపై నల్ల మచ్చలు అంతర్లీన వైద్య పరిస్థితుల వల్ల లేదా మందుల వల్ల సంభవించవచ్చు. లోపాలు తోసిపుచ్చబడితే లేదా పరిష్కరించబడితే మరియు నల్ల మచ్చలు కొనసాగితే, మరింత మూల్యాంకనం మరియు చికిత్స అవసరం కావచ్చు.

### విటమిన్ బి12 లోపం

ఎర్ర రక్త కణాల నిర్మాణం, నరాల పనితీరు మరియు డీఎన్‌ఏ సంశ్లేషణకు విటమిన్ డీ12 చాలా ముఖ్యమైనది. ఈ విటమిన్ లోపం వల్ల నోటి సమస్యలు వస్తాయి, వాటిలో గ్లాసిటిస్ (నాలుక వాపు) మరియు నాలుక రంగు మారడం వంటివి ఉంటాయి. నాలుక ఉపరితలంపై ఉన్న పాపిల్లేలో మార్పుల కారణంగా నల్ల మచ్చలు కనిపించవచ్చు.

### ఇనుము లోపం

శరీరంలో ఆక్సిజన్ రవాణాకు మరియు నాలుకతో సహా ఆరోగ్యకరమైన కణజాలాలను నిర్వహించడానికి ఇనుము చాలా అవసరం. ఇనుము లోపం, లేదా ఇనుము లోపం అనీమియా, నాలుక యొక్క రూపంలో మార్పులకు కారణమవుతుంది, ఉదాహరణకు నల్ల మచ్చలు లేదా కణజాలం నల్లబడటం. ఈ పరిస్థితి గ్లోసిటిస్ మరియు ఇతర నోటి లక్షణాలకు కూడా దారితీయవచ్చు.





## యూటర్న్ తీసుకున్న బంగారం ధరలు..

**హైదరాబాద్, జూలై 2:** రెండు రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు గురువారం మళ్లీ పెరిగాయి. కనిష్ఠ స్థాయిలో కొనుగోళ్లు పెరగడంతో పసిడికి డిమాండ్ పెరిగి ధరలు ఒక్కసారిగా ఎగిశాయి. అదే సమయంలో వెండి ధర కూడా కిలోకు రూ.5 వేల మేర పెరిగింది. గురువారం ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,550గా నమోదైంది. బుధవారంతో పోలిస్తే రూ.3,770 పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,32,500కు చేరగా, ఇది గత ధర కంటే రూ.3,450 అధికం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రాంతాల్లో బంగారం ధరలు ఒకే స్థాయిలో కొనసాగుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,180గా ఉండగా, న్యూఢిల్లీలో రూ.1,44,700, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళలో రూ.1,44,550గా నమోదైంది. మరోవైపు వెండి ధరలు కూడా పెరిగాయి. హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.50 లక్షలకు చేరుకుంది. బుధవారంతో పోలిస్తే కిలోకు రూ.5 వేల పెరుగుదల నమోదైంది. మార్కెట్‌లో కొనుగోళ్ల ఆసక్తి పెరగడం వల్ల బంగారం, వెండి ధరలు మళ్లీ పైబాట పట్టినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

## చికెన్, గుడ్ల ధరలకు రెక్కలు..

### వారం రోజుల్లోనే భారీ పెరుగుదల



**హైదరాబాద్, జూలై 2:** తెలుగు రాష్ట్రాల్లో చికెన్, కోడిగుడ్ల ధరలు గత వారం రోజులుగా భారీగా పెరుగుతున్నాయి. ధరల పెరుగుదలతో మధ్యతరగతి కుటుంబాలు, నాన్‌వెజ్ ప్రియులపై అదనపు భారం పడుతోంది. ముఖ్యంగా వారాంతంలో చికెన్ కొనుగోలు చేయాలంటే వినియోగదారులు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వారం వరకు కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.280 నుంచి రూ.300 మధ్య ఉండగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రాంతాన్ని బట్టి రూ.300 నుంచి రూ.330 వరకు విక్రయిస్తున్నారు. విజయవాడలో కూడా కిలో చికెన్ ధర రూ.320 నుంచి రూ.330 వరకు చేరింది. కొన్ని రిటైల్ దుకాణాల్లో ధరలు ఇంకా ఎక్కువగా ఉన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. చికెన్‌తో పాటు కోడిగుడ్ల ధరలు కూడా పెరిగాయి. నెల రోజుల క్రితం ఒక్క గుడ్డు రూ.6 నుంచి రూ.7 మధ్య ఉండగా, ప్రస్తుతం రూ.8కు చేరింది. దీంతో 30 గుడ్ల ట్రే ధర దాదాపు రూ.240కు చేరుకుంది. ధరల పెరుగుదలకు పలు కారణాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా పౌల్ట్రీ ఫారాల్లో కోళ్ల మరణాలు పెరగడంతో ఉత్పత్తి తగ్గిందని తెలిపారు. అలాగే మొక్కజొన్న, సోయాబీన్ వంటి దాణా ధరలు పెరగడంతో పౌల్ట్రీ నిర్వహణ వ్యయం కూడా అధికమైందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పలువురు రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించినట్లు సమాచారం. సరఫరా తగ్గడం, డిమాండ్ కొనసాగడం వల్ల చికెన్, కోడిగుడ్ల ధరలు ప్రస్తుతం పెరిగిన స్థాయిలోనే కొనసాగుతున్నాయని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## తెలుగు రాష్ట్రాల్లో ఇంధన ధరలు స్థిరం

**హైదరాబాద్, జూలై 2:** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో పెద్దగా మార్పులు లేకపోవడంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఇండియన్ ఆయిల్ భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు ఇంధన ధరలను సమీక్షిస్తాయి. గ్లోబల్ క్రూడాయిల్ ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, రవాణా ఖర్చులు, కేంద్ర ఎక్సైజ్ సుంకం, రాష్ట్ర ప్రభుత్వాల వ్యాట్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ధరలను నిర్ణయిస్తారు. ప్రస్తుతం తెలంగాణలోని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.69, డీజిల్ ధర రూ.103.82గా కొనసాగుతోంది. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ వంటి నగరాల్లో కూడా ధరలు దాదాపు ఇదే స్థాయిలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.51, డీజిల్ ధర రూ.105.20గా ఉంది. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, కర్నూలు వంటి నగరాల్లో కూడా స్థానిక పన్నుల ప్రభావంతో స్వల్ప తేడాలు మినహా ధరల్లో ఎలాంటి మార్పు లేదు. 2017 నుంచి అమల్లో ఉన్న డైలీ డైనమిక్ ప్రైసింగ్ విధానం ప్రకారం ప్రతిరోజూ ఇంధన ధరలను సవరిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో వచ్చే మార్పులను వెంటనే దేశీయ వినియోగదారులకు చేరవేయడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు స్థిరంగా ఉండటంతో దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు కూడా యథాతథంగా కొనసాగుతున్నాయి.

# రష్యాకు పెట్రోల్ ఎగుమతులు షురూ

### ఉక్రెయిన్ దాడులతో ఇంధన సంక్షోభం




**మాస్కో, జూలై 2:** ఉక్రెయిన్ దాడుల కారణంగా ఇంధన మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో ఏర్పడిన ఇంధన కొరతను అధిగమించేందుకు రష్యా భారత్ నుంచి సముద్ర మార్గం ద్వారా పెట్రోల్ దిగుమతులు ప్రారంభించినట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇంధన కొరత తీవ్రరూపం దాల్చడంతో రష్యా ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలపై దృష్టి సారించింది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, భారత్ నుంచి ఇప్పటికే కనీసం 60 వేల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రష్యాకు తరలించారు. ఇందుకోసం 30 నుంచి 40 వేల టన్నుల సామర్థ్యం కలిగిన రెండు ట్యాంకర్లను వినియోగించినట్లు తెలుస్తోంది. బెలారస్‌తో పాటు ఇతర దేశాల నుంచి కూడా నెలకు సుమారు నాలుగు లక్షల టన్నుల గ్యాసోలిన్ దిగుమతి చేసుకోవాలని రష్యా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రష్యాలో వేసవి కాలం కావడంతో రోజువారీ పెట్రోల్ వినియోగం 1.10 లక్షల టన్నులకు చేరుతోంది. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో పలు చమురు శుద్ధి కర్మాగారాలు దెబ్బతినడంతో కొన్ని ప్రాంతాల్లో ఇంధన కొరత ఏర్పడినట్లు అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఇటీవల అంగీకరించారు. అయితే పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. మరోవైపు, షిప్ ట్రాకింగ్ సంస్థల సమాచారం ప్రకారం జూన్ నెలలో భారత్ దిగుమతి చేసుకున్న రష్యా ముడి చమురు పరిమాణం రికార్డు స్థాయికి చేరింది. అంతర్జాతీయ సరఫరా మార్గాల్లో ఏర్పడిన అంతరాయాల నేపథ్యంలో భారత రిఫైనరీలు రష్యా నుంచి భారీగా ముడి చమురును కొనుగోలు చేయగా, ఇప్పుడు అదే భారత్ నుంచి రష్యాకు పెట్రోల్ ఎగుమతులు ప్రారంభం కావడం అంతర్జాతీయ ఇంధన రంగంలో కీలక పరిణామంగా మారింది.

# లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై, జూలై 2:** అమెరికా-ఇరాన్ మధ్య వాణిజ్య చర్చలు సానుకూలంగా సాగుతున్నాయన్న సంకేతాలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో ప్రధాన సూచీలు గణనీయంగా పుంజుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 579.48 పాయింట్లు పెరిగి 77,502.12 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 169.85 పాయింట్లు లాభపడి 24,175.70 వద్ద స్థిరపడింది. ఈ ర్యాలీలో ఐటీ రంగం కీలక పాత్ర పోషించింది. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు టాప్ గెయినర్లుగా నిలవడంతో నిఫ్టీ ఐటీ సూచీ మే 2025 తర్వాత ఒకే రోజులో అత్యధిక లాభాన్ని నమోదు చేసింది. ఆటోమొబైల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ రంగాల షేర్లు కూడా బలంగా రాణించాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ కొనుగోళ్ల జోరు కొనసాగింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.48 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.25 శాతం మేర లాభపడ్డాయి. మార్కెట్‌లో పెట్టుబడిదారుల సెంటిమెంట్ మరింత మెరుగుపడినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. టెక్నికల్‌గా నిఫ్టీ 24,200 నిరోధక స్థాయికి చేరువలో ఉందని మార్కెట్ నిపుణులు తెలిపారు. ఈ స్థాయిని అధిగమిస్తే 24,400-24,450 వరకు ర్యాలీ కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో 24,000 స్థాయి తక్షణ మద్దతుగా పనిచేసే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. ముడి చమురు ధరలు తగ్గడం, అలాగే కృత్రిమ మేధస్సు, రక్షణ సాంకేతికత, ఇంధన భద్రత రంగాల్లో భారత్-జపాన్ మధ్య కుదిరిన తాజా ఒప్పందాలు కూడా దేశీయ మార్కెట్లకు సానుకూలంగా మారాయని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## యాపిల్ తొలి ఫోల్డబుల్ 'ఐఫోన్ ఆల్ట్రా' త్వరలో..

### రూ.2 లక్షలు దాటనున్న ధర?

**కాలిఫోర్నియా, జూలై 2:** యాపిల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సంస్థ తొలి ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ త్వరలో మార్కెట్లోకి రానున్నట్లు అంతర్జాతీయ టెక్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ డివైజ్‌కు 'ఐఫోన్ ఆల్ట్రా' అనే పేరు పెట్టనున్నట్లు లీక్ నివేదికలు సూచిస్తున్నాయి. ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మాక్స్ మోడళ్లతో పాటు ఈ ఫోల్డబుల్ ఫోన్‌ను కూడా వార్షిక లాంచ్ ఈవెంట్‌లో ఆవిష్కరించే అవకాశం ఉందని సమాచారం. లీక్‌ల ప్రకారం సెప్టెంబర్ 8 లేదా 9న లాంచ్ ఈవెంట్ నిర్వహించే అవకాశం ఉండగా, సెప్టెంబర్ 10 లేదా 11 నుంచి ప్రీ-ఆర్డర్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అయితే ఈ తేదీలపై యాపిల్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. ధర విషయానికి వస్తే, ఈ ఫోల్డబుల్ ఐఫోన్ యాపిల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన స్మార్ట్‌ఫోన్‌గా నిలిచే అవకాశముంది. అంతర్జాతీయ మార్కెట్లో దీని ప్రారంభ ధర సుమారు 2,000 డాలర్లు ఉండొచ్చని అంచనా. భారత మార్కెట్లో దిగుమతి సుంకాలు, జీఎస్టీల కారణంగా దీని ధర రూ.2 లక్షలకు పైగా ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో ఐఫోన్ 18 ప్రో ధర కూడా గత మోడల్‌తో పోలిస్తే పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫీచర్ల పరంగా చూస్తే, ఫోన్‌ను పూర్తిగా విప్పినప్పుడు కేవలం 4.5 మిల్లీమీటర్ల మందంతో అత్యంత స్లిమ్ డిజైన్‌లో ఉండనున్నట్లు సమాచారం. స్క్రీన్ మడత వద్ద గీత కనిపించకుండా ప్రత్యేక హింజ్ టెక్నాలజీని ఉపయోగించనున్నట్లు లీక్‌లు చెబుతున్నాయి. పెద్ద డిస్‌ప్లేపై స్ప్లిట్-స్క్రీన్ మల్టీటాస్కింగ్, డ్యూయల్ రియర్ కెమెరా సెటప్, కెమెరా కంట్రోల్ బటన్ వంటి ఫీచర్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఐఫోన్ 18 ప్రో సిరీస్‌లో నెక్స్ట్ జనరేషన్ ఏ20 చిప్‌సెట్, వేరియబుల్ అపెర్చర్ కెమెరా టెక్నాలజీ, కొత్త ఐఓఎస్ 27 ఆపరేటింగ్ సిస్టమ్ ఉండనున్నట్లు సమాచారం. అయితే ఈ వివరాలన్నీ ప్రస్తుతం అంతర్జాతీయ లీక్‌లు, టెక్ రూమర్ల ఆధారంగా వెలువడినవే. యాపిల్ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.






## ఒప్పో రెనో 16 సిరీస్ భారత్‌లో విడుదల..

**న్యూఢిల్లీ, జూలై 2:** ఒప్పో భారత మార్కెట్‌లో తన సరికొత్త రెనో 16 సిరీస్ స్మార్ట్‌ఫోన్లను అధికారికంగా విడుదల చేసింది. ఈ సిరీస్‌లో ఒప్పో రెనో 16, ఒప్పో రెనో 16సీ మోడళ్లు ఉన్నాయి. ఆకర్షణీయమైన అమోలెడ్ డిస్‌ప్లే, శక్తివంతమైన ప్రాసెసర్లు, 50 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా, భారీ బ్యాటరీలు, 80 వాట్ల వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయం, కృత్రిమ మేధస్సు ఆధారిత ఫీచర్లతో ఈ ఫోన్లను కంపెనీ తీసుకొచ్చింది. జూలై 9 నుంచి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు ఒప్పో అధికారిక స్టోర్లలో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఒప్పో రెనో 16లో 8జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.61,999 కాగా, 12జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.67,999గా నిర్ణయించారు. రెనో 16సీ 8జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.46,999, 8జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్ ధర రూ.49,999, 12జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.55,999గా ఉంది. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేసే వారికి 10 శాతం తక్షణ క్యాష్‌బ్యాక్ కూడా అందిస్తోంది. ఈ ఫోన్లు స్టారీ వైట్, సెల్లార్ పర్పుల్, ట్విలైట్ వయోలెట్ రంగుల్లో అందుబాటులోకి రానున్నాయి. రెండు ఫోన్లూ ఆండ్రాయిడ్ 16 ఆధారిత కలర్ ఓఎస్ 16 ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తాయి. ఒప్పో రెనో 16లో 6.32 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 3,500 నిట్స్ గరిష్ఠ ప్రకాశం ఉండగా, రెనో 16సీలో 6.57 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 1,400 నిట్స్ గరిష్ఠ ప్రకాశం అందించారు. పనితీరు పరంగా రెనో 16లో స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్, ఎల్‌పీడీడీఆర్5ఎక్స్ ర్యామ్, యూఎఫ్ఎస్ 3.1 స్టోరేజ్ అందించారు. రెనో 16సీలో మీడియాటెక్ డైమెన్సిటీ 7300 చిప్‌సెట్, ఎల్‌పీడీడీఆర్4ఎక్స్ ర్యామ్, గరిష్ఠంగా 12జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్ లభిస్తుంది. కెమెరా విభాగంలో రెనో 16లో ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో 50 మెగాపిక్సెల్ సోనీ ప్రధాన కెమెరా, 50 మెగాపిక్సెల్ అల్ట్రావైడ్ కెమెరా, 50 మెగాపిక్సెల్ టెలిఫోటో కెమెరా ఉన్నాయి. రెనో 16సీలో 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరాతో పాటు 8 మెగాపిక్సెల్ అల్ట్రావైడ్ కెమెరాను అందించారు. రెండు ఫోన్లలోనూ సెల్ఫీల కోసం 50 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా ఉంది. బ్యాటరీ విషయానికి వస్తే, రెనో 16లో 6,700 ఎంఏహెచ్ బ్యాటరీ, రెనో 16సీలో 7,000 ఎంఏహెచ్ బ్యాటరీని అమర్చారు. రెండు ఫోన్లలోనూ 80 వాట్ల వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయం ఉంది. ఇక ఇతర ఫీచర్లలో ఇన్-డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సార్, ఫేస్ అన్‌లాక్, 5జీ, వై-ఫై, బ్లూటూత్ 5.4, యూఎస్‌బీ టైప్-సీ, జీపీఎస్‌తో పాటు ఐపీ66, ఐపీ68, ఐపీ69, ఐపీ69కే ధూళి, నీటి నిరోధక రేటింగ్‌లను కూడా కంపెనీ అందించింది.

# శ్రీలంకలో టీమిండియా పర్యటన

■ ఆగస్టు 15 నుంచి టెస్టు సిరీస్

**కొలంబో:** టెస్టు సిరీస్ కోసం టీమిండియా జట్టు శ్రీలంకలో పర్యటించనున్నది. ఆగస్టు 15 నుంచి 27వ తేదీ మధ్య ఇరు జట్లు రెండు టెస్టుల్లో తలపనున్నాయి. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఈ సిరీస్ నిర్వహిస్తున్నట్లు శ్రీలంక క్రికెట్ బోర్డు తెలిపింది. గాలేలో తొలి టెస్టు, కొలంబోలో రెండో టెస్టును వేదికగా ఫిక్స్ చేశారు. ఆగస్టు 15వ తేదీన గాలే ఇంటర్నేషనల్ స్టేడియంలో తొలి టెస్టు ప్రారంభంకానున్నది. ఆగస్టు 23వ తేదీ నుంచి కొలంబో స్టేడియంలో రెండో టెస్టు ఆడనున్నారు. గతంలో రెండు సార్లు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో భారత్ ఓడిన విషయం తెలిసిందే. డబ్ల్యూటీసీ టైటిల్‌ను ఇండియా గెలవలేకపోయింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ రేసులో టీమిండియా జట్టు అయిదో స్థానంలో ఉన్నది. ఆ తర్వాత శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. ఇక నవంబర్-డిసెంబర్ నెలల్లో న్యూజిలాండ్‌లోనూ ఇండియా పర్యటించనున్నది. శుభమన్ గిల్ నేతృత్వంలోని భారత టెస్టు జట్టు ఇంగ్లండ్‌తో సిరీస్‌ను 2-2 తేడాతో డ్రా చేసుకున్నది. వెస్టిండీస్‌తో జరిగిన హోం సిరీస్‌ను గెలుచుకున్న విషయం తెలిసిందే. అయితే గత ఏడాది స్వదేశీ గడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో భారత్ ఘోర పరాభవాన్ని చవిచూసింది. 2017లో చివరిసారి శ్రీలంకలో భారత్ పర్యటించింది. 9 ఏళ్ల గ్యాప్ తర్వాత లంకలో టీమిండియా టెస్టు సిరీస్ ఆడనున్నది. గత సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో గెలుచుకున్నది.



# ఇంగ్లండ్ సిరీస్‌కు కోహ్లీ ముమ్మర సన్నద్ధత

## సంజయ్ బంగర్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ

**ముంబై, జూలై 2:** భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్ కోసం ముమ్మరంగా సిద్ధమవుతున్నాడు. టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ పర్యవేక్షణలో కోహ్లీ ప్రత్యేకంగా నెట్ ప్రాక్టీస్ చేస్తుండగా, ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఇంగ్లండ్ సిరీస్‌లో కోహ్లీ రీఎంట్రీపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ కీలక సిరీస్ కోసం కోహ్లీ ఇప్పటికే ముంబై, అలీబాగ్‌లో ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని పూర్తి చేశాడు. బ్యాటింగ్ టెక్నిక్‌లో అవసరమైన మార్పులు చేసుకుంటూ, ఫామ్‌ను మరింత మెరుగుపర్చుకునే దిశగా సాధన చేస్తున్నాడు. జూలై 14 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ప్రకటించిన భారత జట్టులో కోహ్లీకి చోటు దక్కినప్పటికీ, తుది జట్టులో అతని ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంది. టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు ఇప్పటికే వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ ఇకపై పూర్తిగా వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించనున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. కోహ్లీ పునరాగమనంపై అభిమానులతో పాటు ఆయన చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ కూడా ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లండ్ సిరీస్‌లో చివరి వన్డే మ్యాచ్‌ను లార్డ్స్ మైదానంలో ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆయన సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కోహ్లీ నెట్ ప్రాక్టీస్ వీడియోలు ప్రస్తుతం భారత క్రికెట్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.



# లాస్ ఏంజిల్స్‌లో నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభం



**లాస్ ఏంజిల్స్, జూలై 2:** బాలీవుడ్ సూపర్ స్టార్, కోల్‌కతా నైట్ రైడర్స్ సహ యజమాని షారుఖ్ ఖాన్ చిరకాల స్వప్నం సాకారమైంది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన 'నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్' అధికారికంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది తాను ఎప్పటినుంచో కంటున్న కల అని అన్నారు. పొమోనాలోని ఫెయిర్‌ప్లెక్స్‌లో నిర్మించిన ఈ స్టేడియంలో జూలై 1న మేజర్ లీగ్ క్రికెట్‌లో భాగంగా లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్ల మధ్య తొలి మ్యాచ్ నిర్వహించారు. దీంతో తమ సొంత దేశం వెలుపల అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియాన్ని నిర్మించిన తొలి గ్లోబల్ క్రికెట్ ఫ్రాంచైజీగా నైట్ రైడర్స్ గ్రూప్ చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ మాట్లాడుతూ, ఒకప్పుడు కలగా మొదలైన ఈ ప్రాజెక్టు నేడు నిజమైందని అన్నారు. ప్రపంచంలో అత్యధికంగా వీక్షించే రెండో క్రీడ అయిన క్రికెట్‌ను లాస్ ఏంజిల్స్‌కు తీసుకురావడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఇది కేవలం క్రికెట్ మైదానం మాత్రమే కాదని, సమాజం, వినోదం, కుటుంబాల కోసం రూపొందించిన ప్రత్యేక వేదిక అని చెప్పారు. ఈ స్టేడియాన్ని లాస్ ఏంజిల్స్ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి సహకరించిన ఐసీసీ ఛైర్మన్ జై షాతో పాటు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నైట్ రైడర్స్ స్పోర్ట్స్ సీఈఓ వెంకీ మైసూర్ మాట్లాడుతూ, ఈ స్టేడియం క్రికెట్ భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. సుమారు 21 మిలియన్ డాలర్ల వ్యయంతో కేవలం 100 రోజుల్లోనే ఈ మైదానాన్ని నిర్మించామని వెల్లడించారు. ప్రస్తుతం 5,000 మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ స్టేడియాన్ని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ నాటికి 15,000 సీట్ల సామర్థ్యానికి విస్తరించనున్నట్లు తెలిపారు. టీ20 క్రికెట్ ఒలింపిక్స్ వేదికగా ఈ మైదానం నిలిచే అవకాశముందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇప్పటివరకు ఎలాంటి చర్చలు లేవు

# హార్దిక్ ట్రేడ్‌పై సీఎస్‌కే క్లారిటీ

చెన్నై, జూలై 2: ఐపీఎల్ 2026 సీజన్ అనంతరం ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్‌పై జోరుగా వినిపిస్తున్న ఊహాగానాలపై చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) స్పందించింది. హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకొచ్చే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చలు జరగలేదని సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. ఇటీవల హార్దిక్ పాండ్యాను దక్కించుకునేందుకు సీఎస్‌కే, కోల్‌కతా నైట్ రైడర్స్ సహా పలు ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నాయంటూ కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కాశీ విశ్వనాథన్ తెలిపారు. హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) ముగిసిన తర్వాతే జట్టుపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తామని, ఆ తర్వాతే ట్రేడింగ్ వంటి అంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న ఎంఎల్‌సీ టోర్నీ జూలై 18తో ముగియనుంది. ఇదిలా ఉండగా, గత మూడు సీజన్లుగా సీఎస్‌కే ప్లేఆఫ్స్‌కు చేరడంలో విఫలమవుతోంది. 2025లో చివరి స్థానంలో నిలిచిన చెన్నై, 2026లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. దీంతో జట్టులో నాయకత్వ మార్పు అవసరమనే చర్చలు జరుగుతున్న నేపథ్యంలో హార్దిక్ పాండ్యా పేరును పలువురు విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు. మరోవైపు, కొన్ని మీడియా కథనాల ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మినహా మిగతా ఫ్రాంచైజీలు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు ఏ ఫ్రాంచైజీ కూడా దీనిపై అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం హార్దిక్ ట్రేడింగ్ వ్యవహారం ఊహాగానాలకే పరిమితమైంది.








# నయనశ్రీకి మూడు స్వర్ణాలు

**హైదరాబాద్:** తెలంగాణ స్కేటర్ తళ్లూరి నయనశ్రీ డెహ్రాడూన్‌లో జరిగిన నేషనల్ షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు, ఒక కాంస్య పతకంతో మెరిసి వరుసగా ఐదోసారి నేషనల్ చాంపియన్‌గా నిలిచింది. మహిళల 500 మీటర్ల ఈవెంట్‌ను 49.467 సెకండ్లలో, 1000 మీటర్ల పోటీని 1 నిమిషం 47.386 సెకండ్లలో పూర్తి చేసి బంగారు పతకాలు నెగ్గిన యంగ్ స్కేటర్ జూనియర్ మహిళల 1500మీ. పోటీలోనూ అగ్రస్థానంతో స్వర్ణం అందుకుంది. 3000 మీటర్ల మిక్స్‌డ్ రిలే ఈవెంట్‌లో తెలంగాణకు కాంస్యం అందించింది.



# సెరెనా, ఆండ్రీవా ఔట్

**లండన్:** నాలుగేండ్ల తర్వాత వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో రీఎంట్రీ ఇచ్చిన అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్‌కు షాక్ తగిలింది. తను తొలి రౌండ్‌లోనే ఓడి ఇంటిదారి పట్టగా.. ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ మిరా ఆండ్రీవాకు రెండో రౌండ్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఐదో సీడ్ రష్యా స్టార్ ఆండ్రీవా 6-4, 5-7, 4-6తో బార్బొరా క్రెజికోవా (చెక్) చేతిలో పోరాడి ఓడింది. టాప్ సీడ్ సబలెంకా (బెలారస్) 6-1, 7-6 (11/9)తో కెస్లెర్ (అమెరికా)పై, నాలుగో సీడ్ పెగులా (అమెరికా) 7-6 (8/6), 6-1తో సోరిబెస్ (స్పెయిన్)పై గెలిచారు. ఏడో సీడ్ గాఫ్ (అమెరికా) 6-3, 3-6, 7-6 (10/7) తో సియెరా (అర్జెంటీనా)పై, 14వ సీడ్ ఒసాకా (జపాన్) 6-3, 6-2తో గసనోవా (రష్యా)ను ఓడించి మూడో రౌండ్ చేరారు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన తొలి రౌండ్‌లో 44 ఏండ్ల సెరెనా 3-6, 7-6 (8/6), 3-6తో మాయా జాయింట్ (ఆస్ట్రేలియా) చేతిలో మూడు సెట్ల పాటు పోరాడి ఓడిపోయింది. కాగా, పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో వరల్డ్ నంబర్ వన్ సినర్ (ఇటలీ) 7-6 (7/4), 7-6 (7/2), 6-4తో నునో బోర్గెస్ (పోర్చుగల్)ను వరుస సెట్లలో ఓడించగా.. 8వ సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 3-6, 6-3, 7-5, 6-2తో అగ్రెలర్ (స్పెయిన్)పై నెగ్గాడు.

# ఇషాన్@1

**దుబాయ్:** ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకుల్లో భారత వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. సుమారు ఏడాదిపాటు ఈ స్థానంలో ఉన్న డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మను వెనక్కినెట్టి ఇషాన్ ఫస్ట్‌ప్లేస్‌కు దూసుకొచ్చాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వదేశంలోనే జరిగిన టీ20 ప్రపంచకప్‌లో 317 రన్స్ చేసిన ఇషాన్.. 876 రేటింగ్ పాయింట్లతో మొదటి ర్యాంకును కైవసం చేసుకోగా అభిషేక్ (869) రెండో స్థానానికి పడిపోయాడు.





# లయ ఫిట్‌నెస్ సీక్రెట్

సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్న నటి లయ తన ఫిట్‌నెస్ రహస్యాలను వెల్లడించారు. ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఆమె సూచించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన లయ, ఫిట్‌నెస్ అనేది కేవలం అందం కోసమే కాదని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమని చెప్పారు. పెళ్లి, పిల్లల తర్వాత చాలా మంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారని, తాను కూడా ఒక దశలో అలాగే ఆలోచించానని తెలిపారు. వయసు అనేది కేవలం సంఖ్య మాత్రమేనని, శారీరకంగా చురుకుగా ఉంటే వృద్ధాప్య ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఫిట్‌నెస్ లేకపోతే వ్యాధులు త్వరగా వస్తాయని హెచ్చరించారు. జిమ్‌లో వ్యాయామం చేయడం కంటే ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కోసం డ్యాన్స్ చేయడం తనకు ఎక్కువ ఉత్సాహాన్ని ఇస్తుందని లయ చెప్పారు. తన డ్యాన్స్ అకాడమీ విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేయడం వల్ల శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని వివరించారు. పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని లయ సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, చురుకైన జీవనశైలిని అలవర్చుకోవడం వల్ల ఎక్కువకాలం ఆరోగ్యంగా, యవ్వనంగా కనిపించవచ్చని ఆమె తెలిపారు.

# దసరాకు విశ్వంభర

## సన్నాహాలు చేస్తోన్న చిత్రబృందం

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టకేలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బ్జడెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురు మీడియా, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని తెలుస్తుంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. గతంలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ, అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం భారీ విజువల్ ఎఫెక్ట్స్ మరియు గ్రాఫిక్స్ పనులపై చిత్రయూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 'అంజి', 'జగదేకవీరుడు అతిలోకసుందరి' చిత్రాల తర్వాత చిరంజీవి నుండి వస్తున్న పూర్తి స్థాయి సోషియో-ఫాంటసీ సినిమా కావడంతో ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద మెగాస్టార్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.



# త్రిష రాజకీయాల్లోకి వస్తారా?

## తిరుచ్చి ఉపఎన్నికపై జోరుగా ప్రచారం



స్టార్ హీరోయిన్ త్రిష రాజకీయ అరంగేట్రంపై తమిళనాడులో జోరుగా ప్రచారం సాగుతోంది. తిరుచ్చి అసెంబ్లీ ఉపఎన్నికలో అధికార పార్టీ తరఫున ఆమెను బరిలోకి దించే అవకాశమున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ రెండు నియోజకవర్గాల్లో విజయం సాధించిన అనంతరం తిరుచ్చి స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. తొలుత ఈ స్థానంలో నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశాలున్నాయని ప్రచారం జరిగినా, ఆయన తప్పుకోవడంతో కొత్త అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో విజయ్‌కు సన్నిహితురాలిగా పేరున్న త్రిష పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆమెను రాజకీయాల్లోకి తీసుకురావాలని పార్టీ యోచిస్తోందా అనే చర్చలు సాగుతున్నాయి. అయితే త్రిష గానీ, ముఖ్యమంత్రి విజయ్ గానీ ఈ ప్రచారంపై స్పందించలేదు. దీంతో ప్రస్తుతం ఇవన్నీ ఊహాగానాలుగానే మిగిలాయి. ఇక సినీ కెరీర్ విషయానికి వస్తే త్రిష వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతోంది. ఇటీవల విడుదలైన 'కరుప్పు' విజయంతో మంచి జోష్‌లో ఉన్న ఆమె, త్వరలో 'విశ్వంభర' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే మరికొన్ని కొత్త చిత్రాలకు కూడా ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. నటిగా వరుస విజయాలతో పాటు కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటూ త్రిష తన జోరును కొనసాగిస్తోంది.

# నేడు థియేటర్లలోకి నాగబంధం

## హిందీ వర్షన్‌కు బై వన్ గెట్ 2 ఆఫర్




పౌరాణిక అంశాలు, ఫాంటసీ అడ్వెంచర్, థ్రిల్లింగ్ కథాంశంతో తెరకెక్కిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' సినిమా జులై 3న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. విడుదలకు ముందే ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడగా, ఇప్పుడు మేకర్స్ మరో ప్రత్యేక నిర్ణయంతో అందరి దృష్టిని ఆకర్షించారు. సినిమా విడుదల రోజునే ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించేందుకు చిత్ర బృందం 'బై వన్ గెట్ వన్' ఆఫర్‌ను ప్రకటించింది. ఒక టికెట్ కొనుగోలు చేస్తే మరో టికెట్ ఉచితంగా అందించే ఈ స్కీమ్‌ను తొలి రోజు నుంచే అమలు చేస్తున్నారు. ఇటీవల బాలీవుడ్ సినిమాల్లో ఇలాంటి ప్రమోషనల్ ఆఫర్లు ఎక్కువగా కనిపిస్తుండగా, ఇప్పుడు తెలుగు సినిమాల్లో కూడా ఈ తరహా మార్కెటింగ్ వ్యూహాలు చోటుచేసుకోవడం ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఆఫర్ కేవలం హిందీ వెర్షన్‌కు మాత్రమే వర్తిస్తుందని చిత్ర బృందం స్పష్టం చేసింది. తెలుగు లేదా ఇతర భాషల వెర్షన్లకు ఈ సదుపాయం ఉండదు. 'నాగబంధం'ను అత్యంత భారీ నిర్మాణ విలువలతో రూపొందించారు. పౌరాణిక కథాంశానికి ఆధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దినట్లు మేకర్స్ చెబుతున్నారు. ఫాంటసీ ప్రపంచం, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండనున్నాయని ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అడ్వెంచర్ అంశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటులు జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నగర్కర్, రిషభ్ సాహ్నీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథలో ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండేలా దర్శకుడు అభిషేక్ నామా రూపకల్పన చేసినట్లు తెలుస్తోంది. నాగబంధం' సినిమా కాదు... ఓ అనుభవం అన్నారు విరాట్‌కర్ణ. ఆయన కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కిన సినిమానే 'నాగబంధం'. ఓ నటుడిగా అందరి హృదయాల్లో స్థానం సంపాదించాలని ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశా. ఇంత పెద్ద సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శకుడికి రుణపడి ఉంటా. ఇందులో ప్రతిదీ ఓ అద్భుతంలా ఉంటుంది. మన భారతీయ సంస్కృతి, వారసత్వానికి జరిగే ఓ వేడుకలాంటి సినిమా ఇది అన్నారు. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ అందరూ ప్రాణం పెట్టి చేసిన ఖరీదైన సినిమా ఇది. పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మన సంస్కృతి, మన మూలాల్ని ఆవిష్కరిస్తూ, సనాతన ధర్మం గురించి గొప్ప సందేశమిస్తుందీ చిత్రం. ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన అనుభవాన్ని పంచేలా భారీ హంగులతో తెరకెక్కించాం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ప్రతి పది నిమిషాలకు ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించే చిత్రమిది. విజువల్ వండర్‌గా అందరి హృదయాల్ని గెలుస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

# సెన్సార్ నుంచి బటయపడని జననాయగన్

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జననాయగన్' రిలీజ్ చుట్టూ ఇండస్ట్రీలో సరికొత్త చర్చ నడుస్తోంది. గత 7 నెలలుగా ఈ చిత్రం సెన్సార్ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం సెన్సార్ బోర్డు నుండి 'ఎ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లోగా ఈ తుది సర్టిఫికేషన్ పక్రియ పూర్తి కానుందని ఆ వెంటనే హిందీ, తెలుగు వెర్షన్ల సెన్సార్ ఫార్మాలిటీస్‌ను కూడా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తోంది. సెన్సార్ సమస్యలు వీడుతుండటంతో మేకర్స్ ఈ సినిమాను జూలై 16 లేదా జూలై 23న థియేటర్లలోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇప్పటికే ఈ విండోలో పలు క్రేజీ చిత్రాలు తమ విడుదల తేదీలను ప్రకటించాయి. జూలై 17న 'అన్వే డయానా', జూలై 23న 'మకుటం', 'ఇమ్మోర్టల్', అలాగే జూలై 31న 'డిసి', 'సిగ్మా' వంటి చిత్రాలు లైన్లో ఉన్నాయి. ఇప్పుడు ఒకవేళ దళపతి విజయ్ రేసులోకి వస్తే ఇప్పటికే ప్రమోషన్లు మొదలుపెట్టిన ఆయా చిత్రాల కలెక్షన్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే సెన్సార్ ఎ సర్టిఫికెట్ ఇస్తే చిన్న పిల్లలు ఈ సినిమా చూసేందుకు అనుమతించరు. తమ హీరో సినిమాను కావాలనే ఇబ్బందులు పెడుతున్నారని ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ దళపతి చివరి చిత్రం కావడంతో ఈ సినిమా ఎప్పుడు వచ్చినా థియేటర్ల వద్ద జాతర ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com